Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు
# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు
rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 243 పేజీలు (Pages): 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)
గురువారం, 7 - 5 - 2026
94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## నితీశ్ కుమారుడికి మంత్రి పదవి... 7న క్యాబినెట్ విస్తరణ



**పాట్నా:** బీహార్‌లో ఈనెల 7న కీలక మంత్రివర్గ విస్తరణ జరుగనుంది. గాంధీ మైదానంలో పెద్దఎత్తున ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఏర్పాట్లు జరుగుతున్నారు. బిహార్ మాజీ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తనయుడు నిశాంత్ కుమార్ మంత్రివర్గంలో చేరే అవకాశం ఉంది. జేడీయూ నేతలు మంగళవారం రాత్రి జరిపిన సమావేశంలో ప్రభుత్వంలో చేరాలని నిశాంత్‌ను ఒప్పించినట్టు తెలుస్తోంది. ఢిల్లీ నుంచి పాట్నా వచ్చిన కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ సహా, జేడీయూ నేతలు ప్రస్తుతం 7 సర్క్యులర్ రోడ్డులోని నితీశ్ కుమార్ నివాసంలో సమావేశం జరుపుతున్నారు. ఈ సమావేశంలో మంత్రుల తుది జాబితాను ఆమోదించనున్నట్టు తెలుస్తోంది.

**మంత్రివర్గంలో చేరేందుకు నిశాంత్ అంగీకారం**

చాలాకాలంగా యాక్టివ్ పాలిటిక్స్‌కు దూరంగా ఉంటున్న నిశాంత్ ప్రభుత్వంలో చేరేందుకు కూడా తొలుత నిరాకరించారు. అయితే మంగళవారం నాడు జరిగిన జేడీయూ సమావేశంలో సీనియర్ నేతలు ఆయనను ప్రభుత్వంలో చేరేందుకు ఒప్పించినట్టు తెలిసింది. ప్రభుత్వంలో ఆయన చేరడం పార్టీకి, రాష్ట్రానికి కూడా కీలకమని నచ్చచెప్పినట్టు సమాచారం. నిశాంత్ ప్రస్తుతం ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు, నితీశ్ హయాంలో జరిగిన అభివృద్ధి పనుల ఫీడ్‌బ్యాక్‌ను సేకరించేందుకు పలు జిల్లాల్లో 'బిహార్ గుడ్‌విల్ యాత్ర' జరుపుతున్నారు. ఆయన గత మే 8న లాంఛనంగా జేడీయూలో చేరారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ ఝా ఆయనకు సభ్యత్వాన్ని అందజేశారు.

**మంత్రివర్గంలో 27 మందికి చోటు**

కాగా, బిహార్ మంత్రివర్గ విస్తరణలో 27 మందికి చేటు కల్పించనున్నారు. బీజేపీ నుంచి 12 మంది, జేడీయూ నుంచి 11 మంది, ఎల్‌జేపీ (రామ్‌విలాస్) నుంచి ఇద్దరు, హెచ్ఏఎం, ఆర్ఎల్ఎస్‌పీ నుంచి చెరొకరికి మంత్రివర్గంలో చోటు కల్పించనున్నారు.

## అభివృద్ధిని అడ్డుకుంటే తొక్కి పడేస్తాం : మంత్రి కొల్లు రవీంద్ర

**కృష్ణా జిల్లా, (రాజధాని వార్తలు):** బందరు చరిత్ర తిరగరాసేలా అభివృద్ధి చేసి చూపిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. బుధవారం బందరులో తాగునీటి పైపులైన్లు, డీడబ్ల్యూఎమ్ రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. బందరులోని ప్రతి ప్రాంతానికి రోడ్లు, తాగునీటి సౌకర్యాలు అందించేలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఆరోపణలు, విమర్శలు తప్ప మాజీ మంత్రి పేర్ని నానికి బందరు అభివృద్ధి పట్టదని విమర్శించారు. అభివృద్ధి పనులను అడ్డుకుంటే తొక్కి పడేస్తామని కొల్లు రవీంద్ర వార్నింగ్ ఇచ్చారు. గతంలో రోడ్లను కూడా పట్టించుకోలేదని వైసీపీపై మంత్రి విరుచుకుపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంతలు లేని మచిలీపట్నాన్ని సాకారం చేశామన్నారు. తాగునీటి సమస్యల పరిష్కారానికి రూ. 28 లక్షల వ్యయంతో పనులు ప్రారంభించామని తెలిపారు. మచిలీపట్నంలోని అన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గత ఐదేళ్లు మున్సిపాలిటీ అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. గతంలో ఎంపీగా పని చేసిన కొనకళ్ల నారాయణరావు, ప్రస్తుత ఎంపీ వల్లభనేని బాలశౌరి కృషితో కేంద్రం నుంచి నిధులు వచ్చాయని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా నిధులు సమకూర్చి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఇళ్ల నిర్మాణ ప్రాంతంలో ఇనుము దొంగిలించేశారంటూ పేర్ని నాని చేసిన వ్యాఖ్యలపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు ఆరోపణలు చేస్తూ.. ఆధారాలు చూపించమంటే తేలుకుట్టిన దొంగల్లా పారిపోతున్నారని మండిపడ్డారు. మార్కెట్ యార్డులో పెట్టిన ఇనుము పాడైపోతుంటే.. దాన్ని వేరే ప్రాంతంలో ఇళ్ల



నిర్మాణం కోసం వినియోగించడంలో తప్పేముందని ప్రశ్నించారు. తప్పు జరిగితే ఫిర్యాదు చేయాలని.. కానీ అధికారులను బెదిరించడం దుర్మార్గమని మండిపడ్డారు. 2014-19 మధ్య పేదల కోసం నిర్మించిన టిడ్కో ఇళ్లను గత ఐదేళ్లు లబ్ధిదారులకు అందకుండా పాడుబెట్టారని మంత్రి ఆరోపించారు. కరగ్రహారం లేఅవుట్ పేరుతో వైసీపీ నాయకులు పేదల భూములను తక్కువ ధరకు కొని ప్రభుత్వానికి అధిక ధరకు అమ్మి లాభాలు పొందారని వ్యాఖ్యానించారు. ఇళ్లు కట్టుకోవడానికి కూడా పనికిరాని ప్రాంతాల్లో భూ కేటాయింపుల పేరుతో దోచుకున్నారని ఫైర్ అయ్యారు. ఆ లే అవుట్లలో రోడ్లు, తాగునీటి సౌకర్యాలు ఎందుకు ఏర్పాటు చేయలేదని పేర్ని నాని, జగన్ రెడ్డిని ప్రశ్నించారు. పేర్ని నాని రోజూ మీడియా ముందుకు వచ్చి చెత్త ఆరోపణలు చేయడం తప్ప అభివృద్ధి కోసం ఒక్క ఆలోచన కూడా చేయలేదని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు.

## ఉత్తరాంధ్ర ప్రజల కల నెరవేరింది : ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్


**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం నెరవేరిందని, ఈ ఘనత ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు దక్కుతుందని ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ అన్నారు. విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు అంశంపై ఆయన స్పందించారు. విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన మీడియా కార్యక్రమంలో ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ మాట్లాడారు. ఈ రైల్వే జోన్ సాధన కోసం బీజేపీ ఎన్నో పోరాటాలు చేసిందని, విభజన చట్టంలో ఈ అంశంపై స్పష్టత లేనప్పటికీ కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ.. 'రాష్ట్ర విభజన చట్టంలో ప్రత్యేక రైల్వే జోన్ ఇవ్వాలని స్పష్టంగా పేర్కొన లేదు.. కేవలం ఈ అంశాన్ని పరిశీలించాలని మాత్రమే ఉంది. కానీ, 2019 ఎన్నికలకు ముందే ఈ జోన్‌ను ప్రకటించాం.. ఇప్పుడు ఆ కల నెరవేరింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో రైల్వే జోన్ ఏర్పాటుకు అవస రమైన భూమిని అందించడంలో తీవ్ర జాప్యం జరిగింది. ఈ సుదీర్ఘ ప్రక్రియలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రతిష్టాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ జోన్ సాధనలో ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా కీలక పాత్ర పోషించారు. వీరందరికీ కృతజ్ఞ




తలు. ఒకప్పుడు పీయూష్ గోయల్ మాట్లాడుతూ తెలంగాణ ఇవ్వడం సులువు, కానీ రైల్వే జోన్ ఇవ్వడం కష్టం అని అన్నారు. అమరావతి రాజధానికి ఏ విధంగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారో, అదే తరహాలో రైల్వే జోన్‌కు కూడా గెజిట్ నోటిఫికేషన్ వచ్చింది. రైల్వే జోన్ విషయంలో ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయి. ప్రభుత్వం మంచి చేసినా వైఎస్సార్సీపీ, వామపక్షాలు గుర్తించడం లేదు. ఈ నెల 10వ తేదీ తర్వాత రాజకీయాల్లో మార్పులు రాబోతున్నాయి. తెలంగాణలో ప్రధాని నరేంద్ర మోదీ ర్యాలీకి సన్నాహాలు చేస్తున్నాం. త్వరలోనే తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడతాయి' అని అన్నారు.

## ప్రజావసరాలే ప్రభుత్వ ప్రాధాన్యతలు

**- కలెక్టర్లకు దిశా నిర్దేశం చేయనున్న ముఖ్యమంత్రి - గురు, శుక్రవారాల్లో రాష్ట్ర సచివాలయంలో 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ - బెస్ట్ ప్రాక్టిసెస్‌ను ప్రజెంట్ చేయనున్న పలువురు కలెక్టర్లు, ఎస్పీలు - అభివృద్ధి-సంక్షేమం-గ్రోత్ ఇండికేటర్లపై సమీక్షించనున్న సీఎం**




**అమరావతి, (రాజధాని వార్తలు):** ప్రజావసరాలే ప్రభుత్వ ప్రాధాన్యతలు అనే దిశగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోంది. దీన్ని పక్కాగా అమలు చేయడానికి జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు సమావేశమవుతున్నారు. క్రమం తప్పకుండా కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా సీఎం చంద్రబాబు అధ్యక్షతన గురు, శుక్రవారాల్లో 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ సమావేశం జరగనుంది. రెండు రోజుల పాటు జరగనున్న ఈ సమావేశాల్లో జిల్లా కలెక్టర్లతో పాటు... వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. ఇటీవల కాలంలో ప్రజాప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాల వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహించిన క్రమంలో జరుగుతున్న ఈ 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ ప్రాధాన్యత సంతరించుకుంది. పరిపాలనలో ప్రభుత్వ సమర్థతను మరింత మెరుగుపరిచేలా దిశానిర్దేశం చేయడం... అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు పురోగతిని సమీక్షించడమే లక్ష్యంగా రెండు రోజుల కలెక్టర్ల కాన్ఫరెన్సును సీఎం చంద్రబాబు నిర్వహించనున్నారు. ఈ రెండు రోజుల సమావేశాల్లో భాగంగా తొలి రోజున స్వర్ణాంధ్ర పది సూత్రాలు, జిల్లాల వారీగా జీఎస్‌డీపీ గ్రోత్, కేంద్ర ప్రాయోజిత పథకాలు, ఫిర్యాదుల పరిష్కారం, పెట్టుబడులు పెట్టిన కంపెనీల గ్రౌండింగ్, ఫైళ్ల క్లియరెన్స్, ఆర్టీజీఎస్ వంటి అంశాలపై సమీక్షించనున్నారు. ఇక పలువురు కలెక్టర్లు తమ తమ జిల్లాల్లో వివిధ అంశాల్లో అవలంభిస్తున్న బెస్ట్ ప్రాక్టీసెస్‌ను...కలెక్టర్ల సదస్సులో ప్రజెంట్ చేస్తున్నారు. ఇలా ప్రజెంట్ చేసిన వాటిల్లో బాగున్నవి...రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని సీఎం ఆదేశిస్తున్నారు. ఈ క్రమంలో 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ సమావేశంలో నాలుగు జిల్లాలకు చెందిన కలెక్టర్లు... తాము ఆచరించిన బెస్ట్ ప్రాక్టీసెస్‌ను తొలి రోజు ప్రజెంట్ చేయనున్నారు. అలాగే 5, 6 జిల్లా కలెక్టర్ల సమావేశంలో ప్రజెంట్ చేసిన బెస్ట్ ప్రాక్టీసెస్ అమలు ఏ మేరకు వచ్చిందనే అంశంపైనా సీఎం సమీక్షించనున్నారు. ఇక రెండో రోజు సమీక్షా సమావేశంలో సంజీవని, సమ్మర్ యాక్షన్ ప్లాన్, సూపర్ సిక్స్, సంక్షేమం, రెవెన్యూ, ఆదాయార్జన శాఖలు, విద్య, నైపుణ్యాభివృద్ధి, శాంతి భద్రతలపై ముఖ్యమంత్రి సమీక్ష చేస్తారు. రెండవ రోజు భోజన విరామం అనంతరం జిల్లా ఎస్పీలు సమావేశంలో పాల్గొంటారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 06.30 గంటల వరకూ రెండు రోజుల పాటు కలెక్టర్ల సమావేశం జరగనుంది.

## సంఖ్యా బలం కావాలి.. విజయ్‌కు గవర్నర్ అనుమతి నిరాకరణ



**చెన్నై:** టీవీకే చీఫ్ విజయ్‌కు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ షాక్ ఇచ్చారు. తగినంత మెజారిటీ చూపించలేకపోవడంతో విజయ్ ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ అనుమతి నిరాకరించారు. ప్రభుత్వం ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేలు తప్పనిసరని గవర్నర్ స్పష్టం చేశారు. దీంతో తక్షణం ప్రభుత్వం ఏర్పాటుపై సస్పెన్స్ కొనసాగుతోంది. బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను విజయ్ కలుసుకున్నారు. కాంగ్రెస్ మద్దతు ఇచ్చేందుకు ముందుకు వచ్చిందని, పలు పార్టీలుకూడా తమతో చేతులు కలపనున్నాయని గవర్నర్‌కు విజయ్ వివరించినట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం అనంతరం అసెంబ్లీలో బలపరీక్ష నిరూపించుకుంటానని విజయ్ వివరించినట్టు తెలుస్తోంది. అయితే విజయ్ వివరణతో గవర్నర్ సంతృప్తి చెందలేదని తెలుస్తోంది. ప్రభుత్వం ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేల బలం అవసరం కాగా, కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి టీవీకే వద్ద ప్రస్తుతం 112 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. విజయ్ రెండు సీట్లలో గెలవడంతో ఒక సీటును వదులుకోవడం అనివార్యం. దీంతో టీవీకే చేతిలో 107 మంది సభ్యుల బలం మాత్రమే ఉన్నట్టయింది.

కాంగ్రెస్ బలం కూడా కలిపితే టీవీకే బల నిరూపణకు మరో 6 మంది ఎమ్మెల్యేలు అవసరం. ఏఐడీ ఎంకే 47 సీట్లలో గెలవగా, అందులోని ఒకవర్గం టీవీకే వైపు మొగ్గుచూపుతోంది. పీఎంకే-4, ఐయూఎంఎల్-2, సీపీఐ-2, సీపీఎం-2, డీఎండీకే, ఐఎంఎంకే చెరో సీటు కలిగి ఉన్నాయి. టీవీకేకు చిన్న పార్టీల నుంచి మద్దతు లభించే అవకాశాలు బలంగానే ఉన్నాయి. అయితే అధికారికంగా మద్దతు ఇస్తేనే సంఖ్యాబలాన్ని విజయ్ చూపించుకునే అవకాశం ఉంటుంది.

## మైనారిటీల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : మహ్మద్ నసీర్

**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో మైనారిటీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మైనార్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ మహ్మద్ నసీర్ స్పష్టం చేశారు. బుధవారం రాజధాని అమరా వతిలోని ఏపీ అసెంబ్లీలో మైనార్టీస్ సంక్షేమ కమిటీ చైర్మన్ మహ్మద్ నసీర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మహ్మద్ నసీర్ మాట్లాడుతూ.. విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాల్లో మైనారిటీలకు ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. పీఎంజేవీవై కింద రూ.275 కోట్ల నిధుల విడుదల చేసినట్లు చెప్పారు. మైనారిటీల అభివృద్ధికి రూ.1000 కోట్ల డీపీఆర్‌లు సిద్ధం చేశామని పేర్కొన్నారు. గుంటూరు, నంద్యాలలో అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఇమామ్, మౌజన్ల బకాయి గౌరవ వేతనాల విడుదల చేసినట్లు ఆయన వివరించారు. అర్హులైన వారికి కొత్తగా గౌరవ వేతనాల ప్రతిపాదనలు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రార్థనాలయాలకు పొజిషన్ సర్టిఫికెట్స్‌పైనా చర్యలు తీసుకుంటామన్నారు. ముస్లిం మహిళల సాధికారతకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. మైనారిటీలలో స్కిల్ డెవలప్‌మెంట్ కోసం రూ. 20 కోట్ల నిధులు కేటాయించామన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే మైనారిటీ విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తామని చైర్మన్ మహ్మద్ నసీర్ తెలిపారు. మైనారిటీ హాస్టళ్లలో ఖాళీల భర్తీపై చర్యలు తీసుకుంటామన్నారు. బ్యాంకుల ద్వారా రుణాలపై త్వరలో సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు.

వ్యవసాయం, విద్య, ఉపాధి రుణాలకు ప్రాధాన్యం ఇవ్వలని ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. బీసీ-ఈ దూదేకుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించామని పేర్కొన్నారు. మెగా డీఎస్సీలో ఉర్దూ టీచర్ల నియామకంపైనా చర్చించామని చెప్పారు. అన్ని రంగాల్లో మైనారిటీలకు సమాన భాగస్వామ్యం కల్పిం చడమే తమ కమిటీ లక్ష్యమని ఆయన వివరించారు. మైనారిటీల అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని మైనారిటీ సంక్షేమ కమిటీ చైర్మన్ నసీర్ వివరించారు.

# డిగ్రీ పరీక్షా కేంద్రాల్లో వీసీ ఆకస్మిక తనిఖీ

**- పారదర్శకంగా పరీక్షల నిర్వహణకు ప్రాధాన్యం : వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలో మంగళవారం జరిగిన డిగ్రీ రెండో సెమిస్టర్ (రెగ్యులర్ మరియు సప్లీమెంటరీ) పరీక్షా కేంద్రాలను వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా నగరంలోని డీకేడబ్ల్యూ ప్రభుత్వ మహిళా కళాశాలతో పాటు మరికొన్ని పరీక్షా కేంద్రాలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ తీరుపై ఆరా తీసిన వీసీ.. అధికారులకు, సిబ్బందికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

**తనిఖీల్లోని ముఖ్యాంశాలు:**

ప్రశాంత వాతావరణం: విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి, భయాందోళనలకు గురికాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మౌలిక వసతులు: ప్రతి పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు అవసరమైన త్రాగునీరు, గాలి, వెలుతురు లాంటి అన్ని కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

అప్రమత్తంగా ఇన్విజిలేటర్లు: పరీక్షా విధుల్లో ఉన్న ఇన్విజిలేటర్లు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, కట్టుదిట్టమైన పర్యవేక్షణతో ఎక్కడా ఎలాంటి అక్రమాలకు తావులేకుండా చూడాలని స్పష్టం చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: పరీక్షల నిర్వహణ అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలని ఉద్ఘాటించారు. విశ్వవిద్యాలయ పరీక్షా నియమావళిని ఎవరైనా అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నాణ్యమైన పరీక్షల విధానాన్ని అమలు చేయడానికి విశ్వవిద్యాలయం పూర్తిగా కట్టుబడి ఉందని ఆచార్య శ్రీనివాసరావు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# పదవ తరగతి విద్యార్థినికి కలెక్టర్ చేతుల మీదుగా సత్కారం




**దొరవారిసత్రం, (రాజధాని వార్తలు):** మండలంలోని బాలికల గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న కుప్పారెడ్డి పాలెంకు చెందిన తండ్రి జమ్మల (లేట్) బాబు, తల్లి అమ్మాజీల కుమార్తె జమ్మల సన్నిహిత పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో గురుకుల పాఠశాల మొదటి ర్యాంక్ సాధించిన సందర్భంగా తిరుపతి జిల్లా కలెక్టర్ డా.వెంకటేశ్వర్ చేతుల మీదగా కలెక్టర్ భవనంలో ప్రశంసా పత్రం, షీల్డ్‌ను అందుకున్న సందర్భంగా దొరవారిసత్రం బాలికల గురుకుల పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, మరియు కుప్పారెడ్డి పాళ్లెం గ్రామ ప్రజలు అభినందనలు తెలియజేసారు.

# ఘనంగా కారల్ మార్క్స్ జయంతి

**గూడూరు, (రాజధాని వార్తలు):** గూడూరు పట్టణం సిపిఐ కార్యాలయంలో సిపిఐ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా కారల్ మార్క్స్ 203వ జయంతి వేడుకలను నిర్వహించారు. ముందుగా కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్ ప్రభాకర్ మాట్లాడుతూ మహనీయుడు కారల్ మార్క్స్ అని పేర్కొన్నారు. మానవ చరిత్ర గతిని నిర్ణయించేవి ఆర్థిక పరిస్థితులే కానీ రాజకీయ మత, సాంస్కృతిక పరిస్థితులు కావు అని చెప్పిన గొప్ప తత్వవేత్త అని పేర్కొన్నారు. కమ్యునిజం, మార్క్సిజం, సామ్యవాదం, భౌతికవాదం అన్నిటికీ మూలం కార్ల్ మార్క్స్ అని పేర్కొన్నారు. ఆయనకు రాజకీయం, సామాజిక శాస్త్రం, కార్మిక సంబంధాలు, చరిత్ర వర్గ పోరాటాలు ఇలా ప్రతి దాని పట్ల అభిరుచి కల్గి ఉన్నారన్నారు. ఆయన రాసిన పెట్టుబడి లోకానికి ఓ దిక్సూచి అని పేర్కొన్నారు. కార్ల్ మార్క్స్, ఎంగెల్స్ కమ్యూనిస్ట్ పార్టీ ప్రణాళిక వ్రాసారు. నేటి యువత మార్క్స్ ఆశయాలను కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ అధ్యక్షులు జి.శశి కుమార్, నియోజకవర్గ సహాయక కార్యదర్శి జమాలుల్లా, చిల్లకూరు మండల కార్యదర్శి రమేష్, అన్వేష్, ఏ.ఐ.ఎస్. ఎఫ్



నాయకులు రిజ్వాన్, హర్షద్, దీవెన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# బీఏఎస్ఎఫ్ నుంచి 2 జీసీసీలు!

**- 3 వేల మంది కొత్తగా ఉద్యోగాలు - ఏరోస్పేస్ దిగ్గజ హబ్‌గా తెలంగాణ - డ్రోన్ టెక్నాలజీ, శాటిలైట్ కమ్యూనికేషన్స్‌లోనూ గ్లోబల్ లీడర్‌గా నిలుపుతాం : దుద్దిళ్ల**



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** రసాయనాల తయారీలో ప్రపంచంలోని అతిపెద్ద సంస్థల్లో ఒకటైన జర్మన్ దిగ్గజం బీఏఎస్ఎఫ్.. హైదరాబాద్‌లో రెండు జీసీసీ (గ్లోబల్ కేపబుల్ సెంటర్)లను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. గ్లోబల్ డిజిటల్ హబ్, గ్లోబల్ సర్వీసెస్ హబ్‌ల పేరుతో నెలకొల్పే ఈ రెండు జీసీసీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి అంగీకార పత్రం సమర్పించింది. మంగళవారం తాజ్ కృష్ణలో జరిగిన కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో తెలంగాణ లైఫ్‌సైన్సెస్ సీఈవో సర్వేశ్ సింగ్‌కు బీఏఎస్ఎఫ్ సంస్థ గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ అధ్యక్షుడు టోబియాస్ డ్రాట్ అంగీకార పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఇప్పటివరకు ఏడాదికి 75 జీసీసీలు ఏర్పాటు అవుతూ వస్తున్నాయని, కానీ ఈ ఏడాది 100 జీసీసీల ఏర్పాటును లక్ష్యంగా పెట్టుకున్నట్టు వెల్లడించారు. రెండు జీసీసీల వల్ల 3 వేల ఉద్యోగాలు వస్తాయన్నారు. హైదరాబాద్‌ను కార్యాలయాల కేంద్రంగా మాత్రమే కాకుండా, ఆవిష్కరణలు, ఇంజినీరింగ్ రంగాల్లో ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేస్తున్నట్టు శ్రీధర్ బాబు తెలిపారు.. "160 ఏళ్ల చరిత్ర కలిగిన బీఏఎస్ఎఫ్ సంస్థ, ప్రపంచవ్యాప్తంగా 200కి పైగా దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ప్రపంచంలోని పలు నగరాలతో పోటీ పడి హైదరాబాద్ ఈ గొప్ప అవకాశాన్ని దక్కించుకోవడం రాష్ట్రానికి దక్కిన గౌరవం. ఎన్విడియా, మైక్రోసాఫ్ట్, గూగుల్, వాన్‌గార్డ్, ఎలీ లిల్లీ, మారియట్ ఇంటర్నేషనల్ లాంటి దిగ్గజ సంస్థలు ఇక్కడ జీసీసీలు ఏర్పాటు చేసి హైదరాబాద్ నగరానికి ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయి" అని శ్రీధర్ బాబు తెలిపారు. కాగా రంగారెడ్డి జిల్లా శంషాబాద్ హార్డ్ వేర్ పార్క్ (ఫేజ్ – 3)లో రూ.453 కోట్ల పెట్టుబడితో 10 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న 'ఐటీపీ ఏరో – ఇండియా' మ్యానుఫ్యాక్చరింగ్ ప్లాంట్‌కు శ్రీధర్‌బాబు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ ఏరోస్పేస్ దిగ్గజాలకు తెలంగాణను ఒక వ్యూహాత్మక భాగస్వామిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఏరోస్పేస్ డిఫెన్స్ హబ్‌లలో ఒకటిగా తెలంగాణను నిలిపామన్నారు.

# నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటే ఉద్యోగాలు

**- సులభతర వాణిజ్య విధానంపై ఆధారపడే పెట్టుబడులు..ఏఐని సరైన పద్ధతిలో వినియోగిస్తే అందరికీ మేలు - రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ సూచనలు - ఉన్నత, సాంకేతిక విద్యతోపాటు వైద్య విద్య సిలబస్‌లో ఏఐ - ఇందుకోసం కమిటీ వేస్తాం సూచనలివ్వండి.. సీఎం రేవంత్ వినతి**



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** నైపుణ్యాలను మరింత మెరుగుపర్చుకుంటే అనేక రంగాల్లో ఉద్యోగ అవకాశాలున్నాయని ఆర్థిక నిపుణులు, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ స్పష్టం చేశారు. ప్రభుత్వాలు అమలు చేసే సులభతర వాణిజ్య విధానాలపై ఆధారపడే రాష్ట్రాలకు పరిశ్రమలు, పెట్టుబడులు వస్తాయని పేర్కొన్నారు. మానవ వనరుల అభివృద్ధి కోసం పోషకాహార లోపం సమస్యను తగ్గించాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసం నుంచి రఘురామ్ రాజన్‌తోపాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తెలంగాణ భవిష్యత్తు ప్రణాళికపై నిర్వహించిన ఈ సమావేశంలో యువతలో నైపుణ్యాభివృద్ధి, పిల్లలకు పోషకాహార లోపం, మానవ వనరుల అభివృద్ధి, ప్రభుత్వ సులభతర వాణిజ్య విధానం, విద్య, వైద్య రంగాల్లో ఏఐ వినియోగంపై రఘురామ్ రాజన్ రాష్ట్ర ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వాల సులభతర వాణిజ్య విధానం మీద ఆధారపడే కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు వస్తాయని రఘురామ్ రాజన్ ఈ సందర్భంగా అన్నారు. అయితే స్టార్టప్‌లను ఎక్కువ ప్రోత్సహిస్తే మరింత ఉపయోగం ఉంటుందని సూచించారు. పాఠశాల, ఉన్నత, సాంకేతిక విద్యతో పాటు వైద్య విద్య సిలబస్‌లో ఏఐ ఉపయోగంపై కమిటీని ఏర్పాటు చేస్తామని, ఇందుకోసం తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా రఘురామ్ రాజన్‌ను కోరారు. మధ్య స్థాయి ఉద్యోగాల కల్పన కోసం స్కిల్స్ యూనివర్సిటీ, ఏటీసీలను అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం ఆయనకు వివరించారు. ఇందుకు స్పందించిన రఘురామ్ రాజన్.. సరైన పద్ధతిలో ఏఐని వినియోగిస్తే అందరికీ మేలు జరుగుతుందని వ్యాఖ్యానించారు. తమిళనాడు తరహాలో పారిశ్రామిక విధానం ఉంటే మరిన్ని పెట్టుబడులను ఆకర్షించవచ్చని సూచించారు. డేటా సెంటర్ల కోసం పెద్ద ఎత్తున విద్యుత్తు, నీటి ఉపయోగం ఉంటుందని అభిప్రాయపడ్డారు. మూడు నాలుగు నెలల్లో హైదరాబాద్ వస్తానని వెల్లడించారు. ఇక, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమల కోసం కావాల్సిన అన్ని సౌకర్యాలు ఉన్నాయని స్పష్టం చేశారు. రీజనల్ రింగ్ రోడ్డు ఏర్పాటుతో పాటు రేడియల్ రోడ్లు, పరిశ్రమల కోసం ప్రత్యేక క్లస్టర్లు తీసుకురాబోతున్నామని వివరించారు. రాష్ట్రాన్ని మూడు భాగాలుగా విభజించి అభివృద్ధిపై దృష్టి సారించామని, క్యూర్, ప్యూర్, రేర్ మోడల్‌లో ముందుకు వెళుతున్నట్లు ఆయన వివరించారు. యువతలో నైపుణ్యాభివృద్ధి కోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, ఐటీఐలను ఏటీసీలుగా మార్చామని వివరించారు. రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 24 గంటలు శ్రమిస్తున్నారని, తెలంగాణ పారిశ్రామికాభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆయన రఘురామ్ రాజన్‌ను కోరారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సులభతర వాణిజ్యానికి అనుగుణంగా తెలంగాణలో పరిస్థితులు ఉన్నాయని, ఫార్మా, ఐటీ, డేటా సెంటర్ల కోసం కావాల్సిన మంచి వాతావరణం, వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు.

# పోలేరమ్మ జాతరకు 300 మందితో భారీ బందోబస్తు

**- నాయుడుపేట డిఎస్పీ చెంచుబాబు**



**నాయుడుపేట, (రాజధాని వార్తలు):** నాయుడుపేట పట్టణంలో అత్యంత వైభవంగా జరిగే శ్రీశ్రీ పోలేరమ్మ అమ్మవారి జాతరను పురస్కరించుకుని పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు నాయుడు పేట డిఎస్పీ జి.చెంచుబాబు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, జాతర ప్రశాంతంగా ముగిసేలా మొత్తం 300 మంది సిబ్బందితో భారీ బందోబస్తును ఏర్పాటు చేసిన ఆయన పేర్కొన్నారు. ఈ బందోబస్తులో భాగంగా సూళ్ళూరుపేట సీఐ ఎం.మురళీకృష్ణ, నాయుడుపేట సీఐ సంగమేశ్వరరావు, నాయుడుపేట టౌన్ సీఐ టి.వెంకటేశ్వర్లు, వెంకటగిరి సీఐ ఎం.రోశయ్యలతో కూడిన నలుగురు సీఐల బృందం పర్యవేక్షణలో 15 మంది ఎస్సైలు బాధ్య తలు నిర్వహిస్తారని తెలిపారు. వీరితో పాటు 260 మంది హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు మహిళా భక్తుల భద్రత కోసం ప్రత్యేకంగా 25 మంది మహిళా పోలీసులు విధుల్లో ఉంటారని, జాతర జరిగే ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిఘా ఉంచుతామని తెలిపారు. భక్తులు పోలీసులకు సహకరించి జాతరను ప్రశాంతంగా జరుపుకోవాలని అధికారులు కోరారు.

# టివికే పార్టీ అభిమానులు విజయోత్సవ సంబరాలు

**నాయుడుపేట, (రాజధాని వార్తలు):** ప్రముఖ సినీ నటుడు, (టివీకే) తమిళ వెట్రి కళగం పార్టీ అధినేత తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను సాధించటంతో ఆయన అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. సోమవారం నాయుడుపేట పట్టణంలోని ఎన్.ఎస్.ఆర్ కాలనీలో ఎస్ఎమ్ఆర్పిఎస్‌వ్యవస్థాపక అధ్యక్షుడు రాష్ట్ర మాసారం గోపాల్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. సినీ నటుడు హీరో విజయ్ గెలుపొందన సందర్భంగా వారు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం టపాకాయలు పేల్చి, కేక్ కట్ చేసి, స్వీట్స్ పంచిపెట్టారు.



# పుదూరు గురుకులం విద్యార్థులకు కలెక్టర్ సన్మానం



**తిరుపతి, (రాజధాని వార్తలు):** ఇటీవల వెలువడిన పదవ తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ సన్మానించారు. ఈ మేరకు మంగళవారం తిరుపతి కలెక్టరేట్లో పుదూరు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో చదువుతు అత్యుత్తమ మార్కులు సాధించిన ఏంజెల్ ప్రియ, జెస్సికాలను శాలువాతో సత్కరించి మెమెంటోలు అందజేశారు. అలాగే జిల్లా విద్యాధికారి కుమార్ కూడా వారిని సత్కరించారు. తమ విద్యార్థు రెండు జిల్లాల స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించినట్లు పుదూరు గురుకులం ప్రిన్సిపాల్ రూట్ రమోల తెలిపారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు గురుకులం పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

# వెంకమ్మ కృష్ణ సాగరం చెరువుకు పూర్వవైభవం

## - జె.వి.పాలెం రైతన్నల సాగు కష్టాలకు శాశ్వత పరిష్కారం
## - జలధార - జలహారతి' కార్యక్రమంలో భాగంగా పనులు వేగవంతం





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లాలో ఎస్.రాయవరం మండలంలోని జంగులూరు వెలంపాలెం గ్రామ రైతాంగానికి దశాబ్దాల కాలంగా మిగిలిన సాగునీటి కల సాకారం కాబోతోంది. చారిత్రాత్మకమైన వెంకమ్మ కృష్ణ సాగరం చెరువు పునరుద్ధరణ పనులు చేపట్టడం ద్వారా ఆ ప్రాంత వ్యవసాయ ముఖచిత్రం పూర్తిగా మారనుంది. ఒకప్పుడు జలకళతో అలలాడిన చెరువు, కాలక్రమేణా పూడికతో నిండిపోయి తన ఉనికిని కోల్పోయింది. సుమారు 145 ఎకరాల భారీ విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు గర్భం అంతా మట్టితో నిండిపోవడంతో, వర్షాలు కురిసినా నీటిని నిల్వ చేసే సామర్థ్యం లేక అటు సాగునీరు అందక, ఇటు భూగర్భ జలాలు పెరగక రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు, ముఖ్యంగా 145 ఎకరాల ఆయకట్టు ఉన్న ఈ చెరువు కింద పంటలు పండించడం రైతులకు గగనంగా మారింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జలధార – జలహారతి' కార్యక్రమం లో భాగంగా వెంకమ్మ కృష్ణ సాగరం చెరువుకు కొత్త జీవం పోస్తోంది. చెరువు గర్భంలో దశాబ్దాలుగా పేరుకుపోయిన పూడికను తొలగించడంతో పాటు, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేలా పటిష్టమైన చర్యలు చేపడుతున్నారు. కేవలం పూడికతీతకే పరిమితం కాకుండా, చెరువు గట్లను పటిష్టం చేయడం ద్వారా నీటి వృథాను అరికట్టాలని అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఆయకట్టుకు నీరు చేరే ప్రధాన కాలువలను కూడా ఆధునీకరిస్తుండటంతో, చివరి ఎకరం వరకు సాగునీరు అందుతుందనే ధీమా రైతుల్లో వ్యక్తమవుతోంది. ఈ పునరుద్ధరణ పనుల వల్ల కేవలం 150 ఎకరాలకు సాగునీరు మాత్రమే కాకుండా, చుట్టు పక్కల బావులు మరియు బోర్లలో నీటి మట్టం గణనీయంగా పెరిగి తాగునీటి సమస్య కూడా పరిష్కారం కానుంది. ?ఈ మార్పు జంగులూరు, వెలంపాలెం బాటలు వేయనుంది. దిగువ గ్రామాలు ఆర్థిక స్థిరత్వానికి బాటలు వేయనుంది. 150 ఎకరాల పంట భూమిలకు మరియు ఇప్పుడు రెండు పంటలకు సరిపడా నీరు అందే అవకాశం ఉండటంతో, దిగుబడి పెరిగి రైతు కుటుంబాల్లో కొత్త వెలుగులు నిండనున్నాయి. పూడిక మట్టిని రైతులు తమ పొలాలకు తరలించుకోవడం ద్వారా భూమి సారవంతం కావడం మరో విశేషం. వెరసి, వెంకమ్మ కృష్ణ సాగరం చెరువు కేవలం ఒక నీటి వనరుగా మాత్రమే కాకుండా, వందలాది రైతు కుటుంబాల జీవనాధారంగా అవతరిస్తోంది. ఎస్ రాయవరం మండలంలోని ఇతర గ్రామాలకు కూడా స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నది ఈ పునరుద్ధరణ పనుల పట్ల గ్రామస్తులు మరియు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో కిశోరి వికాసం వేసవి సమావేశం





**రాంబిల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం వాడ నర్సాపురం గ్రామంలోని మంగళవారం యలమంచిలి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో "కిషోరి వికాసం వేసవి సమావేశ" కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది.

సమావేశ ముఖ్య ఉద్దేశం "11 సంవత్సరంల నుండి 18 సంవత్సరం" లోపు గల బాల బాలికలకు జీవన నైపుణ్య అభివృద్ధి, రుతుస్రావం పరిశుభ్రత, ఆరోగ్యం, యోగ, విద్య, భవిష్యత్‌పై అవగాహన స్మార్ట్ ఫోన్స్, ఫోక్సో, గృహహింస చట్టాలపై అవగాహన డ్రగ్స్ వంటి విషయాలపై తేదీ 01/05/2026 నుండి తేదీ 10/06/2026 వరకు వారంలో మంగళవారం, శుక్రవారం నాడు ఆడ పిల్లలతో ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు మగ పిల్లలతో మధ్యాహ్నం మూడు గంటల నుండి 5 గంటల వరకు సమావే శాలు ఏర్పాటు చేసి వారికి అర్థం అయిన భాషలో అన్ని విషయా లపై అవగాహన కల్పించి 15 నుండి 20 మంది పిల్లలతో ఒక సంఘాన్ని ఏర్పాటు చేయడం దీని ముఖ్య ఉద్దేశం అని తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్.వి.ఎస్.రాణి అంగన్వాడి సూపర్వైజర్, కే.ఎల్.వి.రమ్య, క్షేత్రస్థాయి సామాజిక కార్యకర్త, జిల్లా బాలల సంరక్షణ విభాగం పిల్లలతో నేరుగా మాట్లాడి జీవన నైపుణ్య అభివృద్ధిపై అవగాహన కల్పిస్తూ కిషోర్ దశలో బాలబాలికలు నైపుణ్యత తెలుసుకోవడం వల్ల వారి యొక్క ఆలోచన, శక్తి, తెలివితేటలు బలపడతాయని మరియు భవిష్యత్తులో వారికి మంచి అవకాశాలు లభిస్తాయని తెలియజేస్తూ, బాలబాలికలు స్మార్ట్ ఫోన్‌కి దూరంగా ఉంటూ వారి భవిష్యత్తును రక్షించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎం.కుమారి అంగన్వాడీ కార్యకర్త, కే.కళ్యాణి అంగన్వాడి సహాయకురాలు మరియు గ్రామంలో ఉన్న కిషోర్ బాల బాలికల తల్లులు కూడా పాల్గొనడం జరిగినది.

# మాజీ డీజీపీ నియామకంపై హైకోర్టులో పిటిషన్




**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** తెలంగాణ రాష్ట్ర భద్రతా సలహాదారుగా మాజీ డీజీపీ బి. శివధర్ రెడ్డి నియామకం చెల్లదంటూ హైకోర్టులో టి.ధన్‌పాల్ రావు పిటిషన్ దాఖలు చేశారు. ఆయన నియామకంపై ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం. 559పై స్టే విధించాలని హైకోర్టుకు ఆయన విజ్ఞప్తి చేశారు. తాత్కాలిక డీజీపీ నియామకంపై గతంలో దాఖలు చేసిన పిటిషన్‌కు అనుబంధంగా కొత్త అప్లికేషన్‌ను పిటిషనర్ కోర్టులో దాఖలు చేశారు. సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా డీజీపీ నియామకం జరిగిందని తన పిటిషన్‌లో ధన్‌పాల్ రావు స్పష్టం చేశారు. యూపీఎస్సీ నుంచి అర్హుల జాబితా తీసుకోలేదని పిటిషన్‌లో ఆయన ఆరోపించారు. ఆ పిటిషన్ పెండింగ్‌లో ఉండగానే.. డీజీపీగా నియామకం జరిగిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. చీఫ్ సెక్రటరీ ర్యాంకులో ఆయనను నియమించడంపై పిటిషనర్ అభ్యంతరం వ్యక్తం చేశారు.

# ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు.. డీజీపీకి సీఎం రేవంత్ ఆదేశాలు



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** డీజీపీ సీవీ ఆనంద్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. తన పర్యటనల సమయంలో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూడాలని డీజీపీని సీఎం ఆదేశించారు. ప్రజలను గంటల తరబడి రోడ్లపై నిలిపివేయొద్దని డీజీపీకి సూచించారు. ఢిల్లీ పర్యటన సందర్భంగా ఎయిర్‌పోర్టు వద్ద ట్రాఫిక్ జామ్‌పై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాన్వాయ్ కోసం ప్రజల పనులకు ఆటంకం కలిగించవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎదురుగా వచ్చే వాహనాలను కూడా ఆపి ఇబ్బంది పెట్టొద్దని సూచించారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

**పోలీస్ కమిషనర్లతో డీజీపీ వీడియో కాన్ఫరెన్స్**


సీఎం ఆదేశాల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ కమిషనర్లతో డీజీపీ సీవీ ఆనంద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ట్రాఫిక్ సమస్యలపై క్షేత్రస్థాయి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం త్వరలో 'ట్రాఫిక్ బ్యూరో' ఏర్పాటు చేస్తున్నట్లు డీజీపీ ప్రకటించారు. కాన్వాయ్ వెళ్లే సమయంలో ట్రాఫిక్ పూర్తిగా ఆపకుండా సింగిల్ లైన్‌లో వాహనాలు పంపే ప్రణాళికను రూపొందించాలని నిర్ణయించారు. రద్దీ సమయంలో ప్రత్యామ్నాయ మార్గాలు ముందుగానే సిద్ధం చేయాలని అధికారులకు డీజీపీ సూచించారు. ఎయిర్‌పోర్టు పరిసరాల్లో అప్రమత్తంగా ఉండాలని డీజీపీ ఆదేశించారు. వర్షాకాలం ముందు.. నీరు నిలిచే ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. సిబ్బందిలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలని.. ఔటర్ రింగ్ రోడ్డుపై అక్రమ పార్కింగ్ నివారణపై దృష్టి సారించాలన్నారు. ఐఎస్‌డబ్ల్యూ, సీఎస్‌డబ్ల్యూ విభాగాలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. శాంతిభద్రతల విభాగం కూడా ట్రాఫిక్ నియంత్రణలో భాగస్వామ్యం అవ్వాలని అధికారులకు డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు.

# కేటీఆర్ వ్యాఖ్యలు దయ్యాలు వేదాలు వల్లించినట్లున్నాయి : ఎమ్మెల్యే నాయిని రాజేందర్




**హనుమకొండ, (రాజధాని వార్తలు):** కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ ఖండించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేటీఆర్ వ్యాఖ్యలు 'దయ్యాలు వేదాలు వల్లించినట్లు' ఉన్నాయని ఎద్దేవా చేశారు. శనివారం జరిగిన బీఆర్ఎస్ రైతు సంగ్రామ సదస్సుపై నాయిని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఒక నకిలీ విత్తనాలు అమ్మే ముఠా అని, వారి హయాంలో 7 వేల మంది రైతులు మరణించారని ఆయన గుర్తు చేశారు. రైతులపై ఎఫ్ఐఆర్ చేయించిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనని, రైతులను నట్టేట ముంచిన చరిత్ర వారిదని ధ్వజమెత్తారు. ధరణి పోర్టల్‌ను అడ్డంపెట్టుకుని రాష్ట్ర సంపదను దోచుకున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ మాట్లాడుతూ' స్క్రిప్ట్ రాసిస్తే చదవడం కాదు, దమ్ముంటే ఆధారాలతో మాట్లాడాలి. రాహుల్ గాంధీని విమర్శించే స్థాయి నీది?. ఒకప్పుడు మీ కుటుంబం సోనియా గాంధీ చుట్టూ తిరిగారు. కేటీఆర్ వెంట ఉన్న వాళ్లంతా దోపిడీదారులే.. నా ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి హనుమకొండ చౌరస్తాకు వస్తావా? రైతులను నట్టేట ముంచింది బీఆర్ఎస్. నా ప్రశ్నలకు కాదు, ముందు నీ చెల్లెలు అడిగే ప్రశ్నలకు సమాధానం ఇవ్వు' అని అన్నారు.

# ప్రజాప్రతినిధుల పేర్ల ముందు గౌరవ పదాలు తప్పనిసరి : అలహాబాద్ హైకోర్టు



**ఢిల్లీ:** ఎంపీలు, మాజీ కేంద్రమంత్రుల పేర్ల ముందు గౌరవప్రదమైన పదాలను తప్పనిసరిగా చేర్చాలని అలహాబాద్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కేవలం సంబోధనల్లోనే కాకుండా, ఎఫ్ఐఆర్‌లలో 'గౌరవనీయులైన' అనే పదాన్ని వాడాలని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రజాప్రతినిధుల పేర్ల ముందు తగిన గౌరవ సూచక పదాలు లేకుండా ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేయడంపై న్యాయస్థానం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులపై కనీస గౌరవం, మర్యాద పాటించడం అవసరమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. చట్టసభల సభ్యులు, మాజీ మంత్రుల విషయంలో ఈ నిబంధనను కచ్చితంగా పాటించాలని అధికారులకు న్యాయస్థానం కీలక సూచనలు చేసింది. మాజీ కేంద్ర మంత్రులు, ఎంపీలకు సంబంధించిన ఒక కేసు విచారణ సందర్భంగా అలహాబాద్ హైకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది.

# ముఖ్యమంత్రి పదవికి హిమంత బిశ్వ శర్మ రాజీనామా




**దిస్పూర్:** అస్సాం ముఖ్యమంత్రి పదవికి హిమంత బిశ్వ శర్మ రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను రాష్ట్ర గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్యకు అందజేశారు. బుధవారం లోక్ భవన్‌కు వెళ్లిన హిమంత బిశ్వశర్మ.. తన కేబినెట్ సహచరులతో కలిసి రాజీనామా చేశారు. దీంతో బీజేపీ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఇదే విషయాన్ని తెలియజేస్తూ సీఎం కార్యాలయం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. రాజీనామాను ఆమోదించి, కొత్త ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించే వరకూ శర్మను తాత్కాలిక ముఖ్యమంత్రిగా కొనసాగాలని గవర్నర్ కోరినట్లు వెల్లడించింది. రాజీనామా అనంతరం లోక్ భవన్ వెలుపల మీడియాతో హిమంత బిశ్వ శర్మ మాట్లాడారు. మే 11 తర్వాత ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రుల ప్రమాణ స్వీకారం జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఇది చరిత్రాత్మక విజయం కావడంతో ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానించినట్లు ఆయన వెల్లడించారు. కేంద్ర పరిశీలకుల సమక్షంలో జరిగే బీజేపీ శాసనసభ పక్ష సమావేశంలో కొత్త సీఎంని ఎంపిక చేస్తారని శర్మ తెలిపారు. కాగా, 126 మంది సభ్యులున్న అస్సాం అసెంబ్లీకి ఏప్రిల్ 9న ఒకే విడతలో ఎన్నికలు జరగగా.. మే 4న ఫలితాలు విడుదల అయ్యాయి. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి 102 స్థానాలను కైవసం చేసుకుంది.

# కేటీఆర్ వ్యాఖ్యలు అహంకారానికి నిదర్శనం : సీతక్క



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను మంత్రి సీతక్క ఖండించారు. కేటీఆర్ వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. కేటీఆర్ వ్యాఖ్యలు అహంకారానికి నిదర్శనమని సీతక్క పేర్కొన్నారు. 'రైతులను బీఆర్ఎస్ పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. బీఆర్ఎస్ హయాంలో పూర్తి రుణమాఫీ జరగలేదు. నాలుగు విడతలతో రైతులను ఇబ్బందులకు గురిచేశారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు పరిహారం ఇవ్వలేదు. కానీ, ప్రజా ప్రభుత్వమైన కాంగ్రెస్ ప్రభుత్వం బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చింది. కేసీఆర్ పంట బోనస్ హామీ నెరవేర్చలేదు. ప్రస్తుత ప్రభుత్వం పంటలకు బోనస్ ఇస్తోంది. రైతు బంధు నిధుల్లో బీఆర్ఎస్ తీవ్ర జాప్యం చేసింది. మా ప్రభుత్వం 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు విడుదల చేసింది' అని మంత్రి సీతక్క తెలిపారు. 'ఫామ్ హౌస్ పాలనలో రైతులు నష్టపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం కట్టుబడి పనిచేస్తోంది. ప్రజల్లో తిరుగుతున్నాం.. ఫారిన్ టూర్లలో కాదు. సమ్మక్క-సారలమ్మ ఆలయంపై కేటీఆర్ అసత్య ఆరోపణలు చేశారు. కమిషన్ల గురించి మాట్లాడే హక్కు కేటీఆర్‌కు లేదు. ప్రజలను తప్పుదారి పట్టించే వ్యాఖ్యలు మానుకోవాలి. లేకుంటే అదే ప్రజలు బుద్ధి చెప్తారు' అని సీతక్క వెల్లడించారు.

# సంపాదకీయం

## ఫలించిన బెంగాల్ నిరీక్షణ

'నేను రాజీనామా చేయను. నాపై గెలిచింది బీజేపీ కాదు, ఎన్నికల కమిషన్' అని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ప్రకటించారు. బెంగాలీ అస్తిత్వం పేరిట మమత, ఆమె అనుయాయులు ఉధృతంగా నిర్వహించిన ప్రచారం, గ్రామాలపై తృణమూల్‌కు ఉన్న పట్టు మూలంగా టీఎంసీ కొద్దిపాటి మెజారిటీతోనైనా గెలుస్తుందని అనేకమంది ఊహించారు. సగానికిపైగా నియోజకవర్గాల్లో ముస్లిం ఆధిపత్యం ఉన్నందువల్ల ఆమె విజయానికి అవరోధాలు లేవని పలువురు విశ్వసించారు. అయితే వీటన్నింటినీ అధిగమించి పశ్చిమ బెంగాల్‌ను భారతీయ జనతా పార్టీ గెలుచుకున్న తీరు స్వతంత్ర భారతదేశ చరిత్రలో అత్యంత కీలకమైన ఘట్టంగా అభివర్ణించడానికి సందేహించనక్కర్లేదు. 'బెంగాల్‌లో ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రవేశంతో భారతదేశంలో బానిసత్వం ప్రారంభమైంది. ఇప్పుడా బానిసత్వం పోయి, జాతీయవాదం వెల్లువెత్తింద'ని బీజేపీ నాయకుడు ఒకరు అన్నారు. నిజానికి బెంగాల్ సామాజిక, చారిత్రక నేపథ్యం, ఆ రాష్ట్రంలో ఉన్న సున్నితమైన మత, సాంస్కృతిక వాతావరణం దృష్ట్యా భారతీయ జనతా పార్టీ ఆ రాష్ట్రంలో ప్రవేశించేందుకు ఇంత కష్టపడనక్కర్లేదు. బెంగాల్ మత రాజకీయాలకు ఎప్పుడూ అతీతం కాదు. 1905లో హిందూ జనాభా ఎక్కువగా ఉన్న బెంగాల్ పశ్చిమ ప్రాంతాలను, ముస్లింలు అధికంగా ఉన్న బెంగాల్ తూర్పు ప్రాంతాలు, అస్సాంను వేరు చేస్తూ బ్రిటిష్ వైస్రాయ్ లార్డ్ కర్జన్ తీసుకున్న నిర్ణయం స్వదేశీ ఉద్యమానికి దారితీసింది. ప్లాసీ యుద్ధంలో బెంగాల్ చివరి నవాబును బ్రిటిష్ వారు ఓడించక ముందు నుంచే హిందూ ముస్లింల మధ్య సామాజిక ఘర్షణలు జరిగాయి. స్వాతంత్ర్యోద్యమంలో బెంగాల్ జాతీయవాదం కీలక ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. బెంగాల్ చైతన్యశీలతపై కీలక ప్రభావం చూపిన రామకృష్ణ పరమహంస, వివేకానందుడు, బంకించంద్ర ఛటర్జీ బెంగాల్‌లో పెల్లుబికిన నూతన జాతీయవాదానికి కారకులయ్యారు. బెంగాల్ యువతే ఎప్పుడో ఒకప్పుడు భారత్‌కు ఆధ్యాత్మిక మహోన్నతిని సాధిస్తుందని వివేకానందుడు విశ్వసించారు. బంకించంద్ర ఛటర్జీ బెంగాల్‌లోని శాక్తేయవాదాన్ని, వైష్ణవ ధర్మాన్ని సమ్మిళితం చేసి, దేశభక్తి భావాలను పురిగొల్పేందుకు ఉపయోగించుకున్నారు. ముస్లిం పాలకులకు వ్యతిరేకంగా సాధువులు తిరుగుబాటు చేసిన వైనాన్ని ఆయన తన నవల 'ఆనంద్ మఠ్'లో అభివర్ణించారు. స్వదేశీ స్ఫూర్తి బెంగాల్‌లోనే ప్రారంభమై దేశమంతటా విస్తరించిందని, అందుకు కర్జన్ చేపట్టిన విభజనే కారణమని గాంధీజీ దక్షిణాఫ్రికా నుంచి వచ్చిన తర్వాత ఒక వ్యాసంలో రాశారు. గాంధీజీ నాయకత్వానికి, కాంగ్రెస్ పనితీరుకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసింది తొలుత బెంగాలీ జాతీయవాదులే. అరబిందోఘోష్, చిత్తరంజన్‌దాస్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ వీరిలో ప్రముఖులు. స్థూలంగా చెప్పాలంటే జాతీయవాదం, హిందూయిజం, ముస్లిం వ్యతిరేకత బెంగాల్ రాజకీయాల్లో అంతర్లీనంగా సాగాయి. 1946లో దేశ విభజన వాతావరణం నెలకొన్న సమయంలో హుసేన్ షహీద్ సుహ్రావర్దీ హయాంలో జరిగిన హింసాకాండ, నౌఖాలీ అల్లర్లు చరిత్ర పుటల్లో కల్లోల ఘటనలుగా మిగిలిపోయాయి. కలకత్తాలో హిందువుల ఊచకోతను తీవ్రంగా వ్యతిరేకించిన హిందూ మహాసభ నాయకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ దేశంలో తొలి హిందూవాద పార్టీ జనసంఘ్‌ను స్థాపించారు. ఆయన కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని తీవ్రంగా వ్యతిరేకించారు. ఇంత సానుకూల వాతావరణం ఉన్నప్పటికీ.. ఆవిర్భవించిన నాలుగున్నర దశాబ్దాలకు గానీ, మోదీ అధికారంలోకి వచ్చిన పన్నెండు సంవత్సరాలకు గానీ పశ్చిమ బెంగాల్‌లో జయపతాకను బీజేపీ ఎగురవేయలేకపోయింది. భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవం ప్రారంభమయింది బెంగాల్‌లో. దేశంలో సంఘ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది కూడా బెంగాలే. దేశమంతటా విస్తరించిన మావోయిజం బెంగాల్‌లోనే ప్రభవించింది. బెంగాల్‌లోనే వామపక్ష శక్తులు మూడు దశాబ్దాలు రాజ్యమేలి ఇప్పుడు ఉనికికోసం పోరాడుతున్నాయి. బెంగాల్‌లోనే దీదీ పాలన దశాబ్దంన్నర పాటూ సాగింది. గడచిన శతాబ్దంలో బెంగాల్ ఉదారవాద, స్వేచ్ఛావాద లౌకిక శక్తులకు, పలు భావాల సంఘర్షణకు, చైతన్యానికి ప్రతీకగా మారింది. రవీంద్రుడు మొదలు ఎందరో కళాకారులు, రచయితలు, గొప్ప సినీ దర్శకులు, నటులు, గాయకులు వంగభూమిలో ఉద్భవించారు. మరి ఇలాంటి బెంగాల్‌లో ఇప్పుడు భారతీయ జనతా పార్టీ ప్రభంజనం వీయడానికి కారణాలు ఏమిటి? సీపీఐ(ఎం) మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అంగీకరించినట్లు.. వామపక్ష కార్యకర్తలే బీజేపీకి ఓటు వేసే వాతావరణం గత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బెంగాల్‌లో ప్రవేశించింది. బెంగాల్ తన మూలాలను వెతుక్కుందా? తన అస్తిత్వాన్ని జాతీయవాదంలో భాగం చేసిందా? ఏమైనా, దేశ చరిత్రలో సంభవించిన అనేక మహోన్నత సంఘటనలకు కేంద్రంగా ఉన్న బెంగాల్‌లో జరిగిన ఈ రాజకీయ పెను మార్పునకు అంతర్లీన కారణాలు ఉండితీరతాయి. చరిత్రలో చోదకశక్తులు లేకపోతే ఏ భావనలూ భౌతిక శక్తిగా మారి పెల్లుబికే అవకాశాలుండవు. ఇప్పుడు బెంగాల్‌లో అదే జరిగిందని, అక్కడ జనం తమకోసం చేస్తున్న నిరీక్షణ ముగిసిందని బీజేపీ వర్గాలు భావిస్తున్నాయి. బీజేపీ నేతలు చరిత్ర చేసిన పాత గాయాలను రేపి, ప్రజల్లో హిందూత్వ భావనలను రేకెత్తించడంలో సిద్ధహస్తులు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విస్తృత కార్యకలాపాలు సరైన సమయంలో ఆజ్యం పోసేందుకు ప్రాతిపదిక కల్పిస్తాయి. ఏమైనా, నిద్రాణమైన బెంగాల్ ఆత్మ మళ్లీ మేల్కొంది. ఈ ఆవాహన ఏ పరిణామాలకు దారి తీయనున్నదో ఇప్పుడే చెప్పడం కష్టం.

# 29, 26వ వార్డులో శ్రీ పోలమ్మ, నూకాలమ్మ ముత్యాలమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవ వేడుకలు

### - ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్






**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** 29వ వార్డు పరిధిలోని అంగడిదిబ్బ వద్ద శ్రీ శ్రీ శ్రీ పోలమ్మ, నూకాలమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల 26వ జాతర మహోత్సవ వేడుకలో దక్షణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లను దర్శించుకుని ప్రజల శ్రేయస్సు, ప్రాంత అభివృద్ధి కోసం ప్రార్ధనలు చేశారు. జాతర ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులతో కలిసి ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సాంస్కృతిక కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

ప్రాంతీయ సంప్రదాయాలను కాపాడు కోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిఎంఆర్డిఏ చైర్మెన్ ప్రణవ్ గోపాల్, మాజీ డిప్యూటీ మేయర్ దల్లి. గోవింద్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సాదిక్, మాజీ కార్పొరేటర్ బుద్దల. అనురాధ, స్థానిక వార్డు కూటమి అధ్యక్షులు ఆగంటి. శ్రావణ్ కుమార్, శేఖర్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ వీరాభిమాని దహన సంస్కారాలకు వాసుపల్లి రూ.10,000 సాయం

### - కుటుంబ సభ్యులను పరామర్శించిన వాసుపల్లి గణేష్ కుమార్

### - ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థన



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఎన్టీఆర్ వీరాభిమాని, మత్స్యకార నాయకులు బర్రి కోదండ మృతి పట్ల వైసిపి విశాఖ దక్షిణ నియోజకవర్గం సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించి, దహన సంస్కారాలకు పదివేల రూపా యల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ రెండుసార్లు తాను ఎమ్మెల్యేగా గెల వడంలో బర్రి కోదండ కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఆయన ఆకస్మిక మృతి పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. బర్రి కోదండ అందరితో కలివిడిగా ఉండే వ్యక్తి అని, తాను నమ్మిన వాళ్ల కోసం చివరి వరకు నిలబడే వ్యక్తిని, మంచి మనసు కలలాంటి వ్యక్తిని కోల్పోవడం చాలా బాధాకరమని అన్నారు. ఒక కుటుంబ సభ్యుడిగా అతనిని భావిస్తున్నానని చెప్పారు. అటువంటి మంచి వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారని అన్నారు. ఎటువంటి స్వార్థం లేకుండా తన వాళ్ళ కోసం ఏమి చేయడానికి, ఎంతవరకైనా వెళ్లే ఇలాంటి వారిని కోల్పోవడం నిజంగా విచారకరమని చెప్పారు. ప్రతి ఒక్కరితో మనసు విప్పి మాట్లాడుతూ, అవసరమైన వారికి తన సహాయం అందజేస్తూ, చాలా గొప్పగా బ్రతికిన వ్యక్తి అని కొనియాడారు. మనల్ని పూర్తిగా నమ్మి, మనకోసం కష్టించి పనిచేసిన వారిని ఎప్పుడు దూరం చేసుకోరాదని ఈ సందర్భంగా చెప్పారు. బర్రి కోదండ ఆకస్మిక మృతి పట్ల ప్రగాడ సంతాపం తెలియజేస్తున్నట్లు చెప్పారు. అలాగే వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ గానగాళ్ల రామరాజు, చింతకాయల వాసు, చేపల రాజు, మత్స్యకార నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ హితంగా ప్రతి ఒక్కరూ జీవించాలి

### - గాలి, నీరు, భూమి కాలుష్యం కాకుండా చూసుకోవాలి

### - ఎపి పిసిబి అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ బి.వీరేంద్ర





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** పర్యావరణ హితంగా ప్రతి ఒక్కరూ జీవించాలి అని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ బి వీరేంద్ర పిలుపునిచ్చారు. సబ్బవరంలో దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయంలో ఎన్‌సిసి 13వ బెటాలియన్ క్యాంపులో లెఫ్ట్‌నెంట్ కల్నల్ స్వర్ణిం ప్రభాత్ అధ్యక్షతన, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ నేతృత్వంలో 600 మంది విద్యార్థులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మనం పీల్చే గాలిని, మనం త్రాగే నీటిని, మనం నివసించే భూమిని కాలుష్యం కాకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ పది మొక్కలు నాటి పెంచాలని కోరారు. సామాజిక వనాలు విస్తారంగా పెంచాల్సిన బాధ్యత మానవాళిదే అని వివరించారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం మాట్లాడుతూ సమస్త జీవరాశిని కాపాడటమే మానవత్వం అన్నారు. దీనివల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు.


మారిషస్‌లో డోడో పక్షులు వేటాడి తినడం వల్ల డోడో పక్షి పుట్టుక ఆగిపోయింది అని వివరించారు. మనిషి జీవులు గూడు నేయలేదని, భూమి మీద ఉన్న జీవుల గూడులో మనిషి ఒక భాగం మాత్రమే అనే ముఖ్యాంశాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించి సమస్త జీవులు రక్షణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఎస్‌వి గోవిందరావు, అసోసియేషన్ ఆఫ్ పీపుల్స్ పవర్ సంస్థ ప్రతినిధి నిమ్మకాయల భాస్కర్, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ ఇంటెర్న్ షిప్ విద్యార్థిని నందిని రోయ్, ఎన్ ఎస్ ఐ ఆర్ టి విద్యార్థులు పాల్గొన్నారు. గోవర్ధన పురం గోశాల ప్రతినిధి దొడ్డ మహేష్ అందజేసిన పిచ్చుకల గూళ్ళు, మట్టి పాత్రలు విద్యార్థులకు పంపిణీ చేశారు.

# జోరుగా కిశోర వికాసం కార్యక్రమాలు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట అర్బన్‌లో గల జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో, యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ ఉన్నత పాఠశాలలోనూ సీడీపీఓ జి.ఉషా ఆధ్వర్యంలో జోరుగా కిశోర వికాసం సమ్మర్ క్యాంపును మంగళవారం చేపట్టారు. దీనిలో 11 నుంచి 18 సంవత్సరాల వయస్సు ఉన్న బాలబాలికలు ఉద్దేశించి సూపర్వైజర్ ఎండీ సుల్తాన్ బీబీ, ఉమాదేవిలు మాట్లాడుతూ బాల బాలికల హెల్త్ అండ్ న్యూట్రిషన్, అక్రమ రవాణా, బాల్య వివాహాలు, డ్రగ్స్ వినియోగం వల్ల నష్టాలపై వివరిస్తూ టీనేజీలో బాలబాలికలు తప్పుదోవ పట్టే అవకాశాలు అధికంగా ఉంటాయన్నారు. మంచి చెడులను గ్రహించే శక్తి ఆ వయసులోనే ప్రారంభమ వుతున్నందున వారంతా పెద్దల మాటలకు లోబడి సన్మార్గంలో నడవాలి అన్నారు. బాగా చదువుకోవడంతోపాటు సామాజిక అంశాల పైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ అంశాలపై కిషోర్ బాలికలు వారి తల్లులకు అవగాహన కల్పించారు. అలాగే పాఠశాల పరిసర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీలు, ప్రతిజ్ఞలు జరిపించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్స్ ఎన్ అనంతలక్ష్మి, ఈ చంద్రకళ, ఎ ఎన్ ఎం కె సరస్వతి, సత్యనారాయణమ్మ, కమల, ఝాన్సీ, క్రాప్ సిబ్బంది బి లక్ష్మి, ఆశాలు రామ్ కుమారి, రజిని, జి ఎం ఎస్ కే లీలారాణి, అంగన్వాడీ కార్యకర్తలు, హెచ్ వి రమణి, బిఎ వెంకటలక్ష్మి, కె.మాలతి కుమారి, ఎం శేష్ రత్నం, విసిహెచ్ అప్పలరాజు, ఎస్కె వాలిజన్, ఎం దుర్గ, రాజేశ్వరి, లక్ష్మి, కిశోర బాలికలు పాలొన్నారు.

# కోటలో బీజేపీ విజయోత్సవ వేడుకలు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట పట్టణంలో మంగళవారం తాజాగా వెలువడిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో భారతీయ జనత పార్టీ (ఎన్డిఎ) వెస్ట్ బెంగాల్, పుదుచ్చేరి, అస్సాం, రాష్ట్రాలలో ఘనవిజయం సాధించిన సందర్భంగా విజయోత్సవ వేడుకలను జరుపుకున్నారు. పట్టణంలోని స్టేషన్ సెంటర్ వద్ద గల క్లాక్ టవర్ సెంటర్ వద్ద జరిగిన విజయోత్సవ సంబరాల్లో బిజెపి సీనియర్ నాయకులు సుంకవిల్లి బాపిరాజు, వల్లూరి బుల్లియ్య, సామర్లకోట పట్టణ అధ్యక్షులు పుప్పాల నాగ గోవిందు, జనరల్ సెక్రటరి జానీ మోజెస్, పట్టణ ఉపాధ్యక్షులు యాగటి సోమేశ్వరరావు, విజయలక్ష్మి జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు విప్పేర్ల సాయిబాబులు పాల్గొని మాట్లాడారు. రానున్న స్థానిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో కుడా బిజెపికి అదే విజయం చేకూరుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ప్రజలకు, వ్యాపారులకు స్వీట్లు పంచి వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సనత్‌నగర్‌లో దారుణం.. భార్యపై భర్త దాడి, చికిత్స పొందుతూ మృతి




**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** నగరంలోని సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. కోపోద్రిక్తుడైన భర్త, భార్యపై విచక్షణారహితంగా దాడి చేయడంతో, ఆమె తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సనత్‌నగర్ ప్రాంతానికి చెందిన చంద్ర భాను, అతని భార్యల మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే మరోసారి ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఆగ్రహంతో ఊగిపోయిన చంద్ర భాను భార్యపై దాడి చేశాడు. ఈ దాడిలో ఆమె తీవ్రంగా గాయపడింది. స్థానికులు, కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అయితే, పరిస్థితి విషమించడంతో ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. సమాచారం అందుకున్న సనత్‌నగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. నిందితుడు చంద్ర భానును అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

# బండ్ల గణేష్ స్టైల్.. ఎంగేజ్మెంట్ గిఫ్ట్ చూసి షాక్.. ఖరీదు ఎంతంటే?






టాలీవుడ్ సెన్సేషనల్ ప్రొడ్యూసర్ బండ్ల గణేష్ ఇంట్లో ఇప్పుడు పెళ్లి సందడి అంబరాన్నంటుతోంది. ఆయన కుమార్తె జనని నిశ్చితార్థం రీసెంట్‌గా చాలా గ్రాండ్‌గా జరిగింది. అయితే ఈ వేడుకలో అందరినీ ఆశ్చర్యపరిచింది మాత్రం అతిథులకు ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్స్. ఒక్కో గిఫ్ట్ విలువ వింటే సామాన్యులు షాక్ అవ్వాల్సిందే. ఎంగేజ్‌మెంట్‌కే ఈ రేంజ్‌లో ఉంటే, ఇక పెళ్లి ఏ స్థాయిలో ఉంటుందో అని నెటిజన్లు చర్చించుకుంటున్నారు. ఆ విశేషాలు చూద్దాం .. బండ్లన్న ఇంట్లో పెళ్లి బాజాలు: టాలీవుడ్‌లో తనదైన మాటలతో, సినిమాలతో ఎప్పుడూ వార్తల్లో ఉండే బండ్ల గణేష్ ఇప్పుడు తన కూతురి పెళ్లి పనుల్లో బిజీగా ఉన్నారు. జనని త్వరలోనే సూర్యతేజ అనే అబ్బాయితో ఏడడుగులు వేయబోతోంది. వీరి నిశ్చితార్థ వేడుక హైదరాబాద్‌లోని ఒక ప్రముఖ హోటల్‌లో చాలా వైభవంగా జరిగింది. సినీ రంగంతో పాటు రాజకీయ ప్రముఖులు, కూడా ఈ వేడుకకు తరలివచ్చారు. అతిథుల కోసం అదిరిపోయే గిఫ్ట్స్: సాధారణంగా పెళ్లిళ్లలో తాంబూలం లేదా చిన్న చిన్న బహుమతులు ఇస్తుంటారు. కానీ బండ్ల గణేష్ మాత్రం తన స్థాయికి తగ్గట్టుగా చాలా వెరైటీగా ఆలోచించారు. తన కూతురి ఎంగేజ్‌మెంట్‌కు వచ్చిన అతిథులకు ఎవరూ ఊహించని విధంగా ఖరీదైన 'రిటర్న్ గిఫ్ట్స్' ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ గిఫ్ట్ బాక్స్‌కు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. 5 వేల రూపాయల బిర్యానీ హండీ: ఈ వేడుకకు వచ్చిన ప్రతి ఒక్కరికీ దాదాపు 5 వేల రూపాయల విలువ చేసే గిఫ్ట్ ప్యాక్ అందించారట. ఇందులో 'బర్గనర్' అనే ఆస్ట్రియన్ బ్రాండ్‌కు చెందిన ఒక నాణ్యమైన బిర్యానీ హండీ ఉంది. అది కూడా సుమారు 5 కిలోల సామర్థ్యం కలదని తెలుస్తోంది. దాంతో పాటు ఒక స్వీట్ బాక్స్, ఒక బ్లౌజ్ పీస్ కూడా ఆ గిఫ్ట్ బాక్స్‌లో పెట్టి అతిథులకు గౌరవంగా అందజేశారు. ప్రముఖుల సమక్షంలో వేడుక: ఈ వేడుకకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మెగా స్టార్ చిరంజీవి వంటి దిగ్గజాలు హాజరై కొత్త జంటను ఆశీర్వదించారు. ముఖ్యంగా బండ్ల గణేష్ రాజకీయంగా, సినీ పరంగా అందరితో మంచి సంబంధాలు కలిగి ఉండటంతో ఈ వేడుక చాలా సందడిగా సాగింది. ఇక వచ్చిన అతిథులను రిటర్న్ గిఫ్ట్స్‌తో బండ్లన్న సర్ప్రైజ్ చేయడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

అల్లుడు ఎవరో తెలుసా?: బండ్ల గణేష్ కాబోయే అల్లుడు సూర్యతేజ చిలుకూరి కుటుంబానికి పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ వ్యాపారాలు ఉన్నాయని సమాచారం. అబ్బాయికి కూడా కోట్లలో ఆస్తులు ఉన్నట్లు తెలుస్తోంది. సూర్యతేజ ప్రస్తుతం ఏ రంగంలో ఉన్నారు అనే దానిపై ఇంకా పూర్తి వివరాలు తెలియనప్పటికీ, బండ్లన్న తన కూతురి కోసం ఒక గొప్ప సంబంధాన్ని వెతికి పట్టుకున్నారని ఫ్యాన్స్ అంటున్నారు. ఏది చేసినా 'రాయల్' గా చేయడమే బండ్ల గణేష్ స్టైల్ అని మరోసారి నిరూపితమైంది.

# నల్ల చీరలో పాయల్ హొయలు



సినీ పరిశ్రమలో ఎప్పుడూ లైమ్ లైట్‌లో ఎలా ఉండాలో.. ప్రేక్షకుల దృష్టిని ఎలా ఆకర్షించాలో పాయల్ రాజ్‌పుత్‌కు తెలిసినంతగా మరెవరికీ తెలియదేమో!. సోషల్ మీడియాలో నిరంతరం యాక్టివ్‌గా ఉండే ఈ భామ తాజాగా పోస్ట్ చేసిన ఫోటోలు ఇంటర్నెట్‌ను ఊపేస్తున్నాయి. బ్లాక్ అండ్ గోల్డ్ లైనింగ్ శారీలో పాయల్ మెరిసిపోతున్న తీరు నెటిజన్లను మంత్రముగ్ధులను చేస్తోంది. అందమైన ఎక్స్‌ప్రెషన్స్‌తో ఈ యంగ్ బ్యూటీ ప్రదర్శించిన హొయలు కుర్రకారును విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. ఎంపిక చేసిన బ్లాక్ శారీపై గోల్డ్ షైన్ పాయల్ లుక్ ని ఎలివేట్ చేసిందనే ప్రశంసలు కురుస్తున్నాయి. ఈ డిజైనర్ శారీలో పంజాబీ సోయగం లుక్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. పాయల్ కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా.. తన మనసులోని భావాలను కూడా అంతే నిజాయితీగా ఓపెనవుతుంది. ఇటీవల ఒక సినిమా ప్రమోషన్స్ సందర్భంగా తెలుగు మీడియా తన దివంగత తండ్రి గురించి అడిగిన ప్రశ్నకు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఆ సమయంలో కన్నీటి పర్యంతమై అక్కడి నుండి నిష్క్రమించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. పాయల్ ఎంత సెన్సిటివ్.. ఉద్వేగభరితమైన వ్యక్తి అనేదానికి ఈ ఘటన ఒక ఉదాహరణగా నిలిచింది. అయితే తన వృత్తిగత కట్టుబాట్లకు ప్రాధాన్యతనిస్తూ పాయల్ తన కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తోంది. టాలీవుడ్‌లో ఎలాంటి గాడ్ ఫాదర్ లేకుండానే పాయల్ తన స్వయంకృషితో అవకాశాలను అందుకుంటోంది. అవకాశాలు ఉన్నా లేకపోయినా ఎప్పుడూ ఆశావహ దృక్పథంతో తనను తాను ఒక ఉత్తమ నటిగా మలుచుకునేందుకు నిరంతరం ప్రయత్నిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. కెరీర్ విషయంలో ఎంతో ప్రయోగాత్మక ఆలోచనలతో ముందుకు సాగే పాయల్.... గ్లామర్ పాత్రలతో పాటు నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలను కూడా ఎంచుకుంటూ తనదైన ముద్ర వేస్తోంది. ప్రస్తుతం పాయల్ ధరించిన చీర కట్టుపై ఇంటర్నెట్‌లో జోరుగా చర్చ సాగుతోంది. ఇక పాయల్ రాజ్‌పుత్ నటిస్తున్న తదుపరి చిత్రాల విషయానికి వస్తే.. ఈ బ్యూటీ ప్రస్తుతం గోల్‌మాల్ ..కిరాతక వంటి ఆసక్తికరమైన ప్రాజెక్టులలో భాగమైంది. గోల్‌మాల్ చిత్రం ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. ఇది ఒక పూర్తి స్థాయి ఎంటర్‌టైనర్‌గా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే కిరాతక సినిమా కూడా తన కెరీర్‌లో ఒక విభిన్నమైన చిత్రంగా నిలుస్తుందని సమాచారం. ఈ రెండు సినిమాలు 2026 ద్వితీయార్థంలో లేదా ఏడాది చివరలో విడుదలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి పాయల్ రాజ్‌పుత్ తన జీవితంలోని కీలకమైన వ్యక్తిగత, వృత్తిగత వ్యవహారాలను బ్యాలెన్స్ చేస్తూ నటిగా నిరూపించుకునే దిశగా దూసుకుపోతోంది.


ఓ పక్క తన తండ్రి జ్ఞాపకాలతో కూడిన ఉద్వేగం..మరోవైపు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేసే ఫోటో షూట్‌లతో ఎప్పుడూ వార్తల్లో నిలుస్తోంది. విభిన్నమైన కథాంశాలతో రూపొందుతున్న తన తదుపరి సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటాయో చూడాలి.

# డైరెక్టర్ గా లావణ్య.. సతీ లీలావతిపై లావణ్య నెక్స్ట్ లెవెల్ కాన్ఫిడెన్స్!



టాలీవుడ్‌లో కంటెంట్‌తో పాటు క్లీన్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు ప్రాధాన్యం పెరుగుతున్న ఈ సమయంలో, ప్రేక్షకులకు నవ్వులు పంచే మరో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా సతీ లీలావతి సిద్ధమవుతోంది. ఆనంది ఆర్ట్స్ సమర్పణలో దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ నిర్మిస్తున్న ఈ సినిమాలో లావణ్య త్రిపాఠి కొణిదెల, దేవ్ మోహన్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. భీమిలీ కబడ్డీ జట్టు, ఎస్.ఎం.ఎస్ వంటి సినిమాలతో గుర్తింపు పొందిన తాతినేని సత్య దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీ మే 8న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. రిలీజ్‌కు ముందు చిత్ర బృందం ప్రమోషన్స్‌ను వేగవంతం చేయగా, హీరోయిన్ లావణ్య త్రిపాఠి మీడియాతో పలు ఆసక్తికర విషయాల్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడు తూ, సతీ లీలావతి చిత్రంపై తనకు పూర్తి నమ్మకం ఉందని తెలిపారు. ఇప్పటికే సినిమా చూసిన ఆమె, ఇది పూర్తిగా ఎంటర్‌టైనింగ్‌గా ఉండబోతోందని, ముఖ్యంగా కామెడీ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటుందని చెప్పారు. షూటింగ్ సమయంలోనే తాను గర్భవతిని అని తెలిసిందని, అయినప్పటికీ టీమ్ సపోర్ట్‌తో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనిని పూర్తి చేసుకున్నానని వెల్లడించారు. ప్రతి రోజూ షూటింగ్ తర్వాత హాస్పిటల్‌కి వెళ్లి చెకప్ చేయించుకోవాల్సి వచ్చిందని, కొన్ని సీన్స్‌లో శారీరకంగా కష్టమైనా, పాత్ర కోసం ఎంతో కట్టుబాటుతో పనిచేశానని చెప్పారు. ఇకపై ఇలాంటి పరిస్థితుల్లో షూటింగ్‌లకు విరామం ఇవ్వాలని నిర్ణయించుకున్నానని కూడా పేర్కొన్నారు. ఈ సినిమాలో తాను డైరెక్టర్ పాత్రలో కనిపిస్తానని, కథలో వినోదం, భావోద్వేగాలు సమపాళ్లలో ఉంటాయని లావణ్య వివరించారు. మంచి మెసేజ్ ఉన్నప్పటికీ, అది ఎక్కడా క్లాస్ పీకుతున్నట్టు అనిపించదని, ప్రేక్షకులు సహజంగా కనెక్ట్ అయ్యేలా కథనం ఉంటుందని అన్నారు. తన మేనేజర్‌తో కలిసి సినిమా చూసేటప్పుడు అనేక సన్నివేశాల్లో నవ్వులు ఆపుకోలేకపోయామని చెప్పడం, సినిమాలోని కామెడీ లెవెల్‌ను సూచిస్తోంది. యాక్షన్ సీక్వెన్స్‌లలో కూడా తొలిసారి పాల్గొన్నానని, ముఖ్యంగా ఒక ఫైట్ సీన్‌లో కాస్త ఇబ్బంది అనిపించినా, ఆ అనుభవం కొత్తగా అనిపించిందని లావణ్య చెప్పారు. పర్సనల్ లైఫ్‌పై మాట్లాడిన లావణ్య, తాను ప్రస్తుతం భర్త వరుణ్‌తో పాటు కుటుంబంతో సంతోషంగా గడుపుతున్నానని తెలిపారు. సినిమా కథలో చూపిన రిలేషన్‌షిప్‌లకు రియల్ లైఫ్‌లో పోలికలు ఉండవని, అలాంటి పరిస్థితులు ఎవరికీ రాకూడదని అభిప్రాయపడ్డారు. తన కెరీర్ విషయంలో ప్రస్తుతం కొంత గ్యాప్ తీసుకుని, కుటుంబానికి సమయం కేటాయించాలని భావిస్తున్నానని వెల్లడించారు. అలాగే, ఫ్యూచర్‌లో వరుణ్‌తో కలిసి నటించే అవకాశం వస్తే తప్పకుండా ఆలోచిస్తానని చెప్పారు. సినిమా ప్రమోషన్స్‌కు సంబంధించి కూడా లావణ్య ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రామ్‌చరణ్ ట్రైలర్‌ను రిలీజ్ చేయడం ద్వారా సినిమాకు మంచి రీచ్ వచ్చిందని, ఆయనెప్పుడూ సపోర్టివ్‌గా ఉంటారని పేర్కొన్నారు. చిరంజీవి కూడా తమలాంటి కొత్త ప్రాజెక్ట్‌లను ఎంకరేజ్ చేస్తారని తెలిపారు. కో యాక్టర్ దేవ్ మోహన్ టాలెంట్ ను ప్రశంసించిన ఆమె, తాను కూడా ఈ సినిమాలో సొంతంగా డబ్బింగ్ చెప్పేందుకు ట్రై చేశానని చెప్పారు. మొత్తానికి సతీ లీలావతి సినిమా హాస్యంతో పాటు హృదయాన్ని తాకే అంశాలను మిళితం చేసిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. కమల్ హాసన్ క్లాసిక్‌తో పోల్చకూడదని స్పష్టం చేసిన లావణ్య, తమ సినిమా ప్రత్యేకమైన వినోదాన్ని అందిస్తుందని నమ్మకంగా చెబుతున్నారు. రిలీజ్‌కు ముందు నుంచే మంచి బజ్ సంపాదించిన ఈ సినిమా, బాక్సాఫీస్ వద్ద ఎలా మెప్పిస్తుందో చూడాలి.

# కొత్త జానర్‌లో నారా రోహిత్.. ఒక పోస్టర్‌తోనే హైప్




టాలీవుడ్‌లో కొత్త కాన్సెప్ట్‌లకు ప్రేక్షకుల నుండి వస్తున్న ఆదరణ మధ్య, యంగ్ హీరో రోహిత్ నారా తన కెరీర్‌ను మరింత వైవిధ్యంగా మలుచుకునే దిశగా ముందడుగు వేస్తున్నారు. రీసెంట్‌గా సుందరకాండ సినిమాతో వినోదభరితమైన ప్రదర్శన ఇచ్చిన ఆయన, ఇప్పుడు మరో ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. #RN23 అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా ద్వారా రోహిత్ కొత్త జానర్‌లో తన సామర్థ్యాన్ని చూపించాలనే ప్రయత్నం చేస్తున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా, డెబ్యూ డైరెక్టర్ చినిమిల్లి మణికుమార్‌తో ఆయన కాంబినేషన్ కుదరడం ఈ ప్రాజెక్ట్‌కు స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలుస్తోంది. ఈ మూవీ అనౌన్స్‌మెంట్ పోస్టర్ రిలీజైన వెంటనే సోషల్ మీడియాలో చర్చకు దారి తీసింది. షౌటింగ్ సూన్ సరికొత్త ట్యాగ్‌లైన్‌తో వచ్చిన ఈ పోస్టర్, సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేసింది. సాధారణంగా టీజర్ లేదా ఫస్ట్ లుక్ ద్వారా హైప్ క్రియేట్ చేసే ట్రెండ్ మధ్య, కేవలం ఒక పోస్టర్ ద్వారానే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడం ఈ టీమ్ స్ట్రాటజీని ప్రత్యేకంగా నిలబెడుతోంది. పోస్టర్‌లో కనిపిస్తున్న కలర్ ఫుల్ డిజైన్ చూస్తుంటే ఇదొక ఫీల్ గుడ్ ఎంటర్టైనర్ అనే సిగ్నల్స్‌ను ఇస్తోంది. దీంతో, కథలో ఎమోషన్‌తో పాటు ఎంటర్టైన్‌మెంట్‌కు కూడా సమాన ప్రాధాన్యం ఉంటుందని అంచనాలు పెరుగుతున్నాయి. ఈ ప్రాజెక్ట్‌ను కరణ్ సి ప్రొడక్షన్స్ LLP బ్యానర్‌పై భరత్ చౌదరి నిర్మిస్తున్నారు. కొత్త డైరెక్టర్‌తో సినిమా చేయడం ఒక రిస్క్ అయినప్పటికీ, కంటెంట్‌పై నమ్మకంతోనే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. టాలీవుడ్‌లో రీసెంట్‌గా కొత్త దర్శకులు వినూత్న కథలతో మంచి విజయాలు సాధిస్తున్న నేపథ్యంలో, #RN23 కూడా ఆ జాబితాలో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక రోహిత్ నారా కెరీర్ పరంగా చూస్తే, ఇదొక కీలక మలుపుగా మారవచ్చని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. త్వరలోనే శుభ ముహూర్తంతో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. షూటింగ్ మొదలయ్యాక ఇతర నటీనటులు, టెక్నికల్ టీమ్ వివరాలను వెల్లడించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం టైటిల్ కూడా ఫిక్స్ కాలేదు కాబట్టి, టీమ్ ప్లానింగ్ దశలోనే ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తించడం గమనార్హం. మొత్తానికి, #RN23 ఒక సాధారణ సినిమా ప్రకటనగా కాకుండా, కంటెంట్ ఆధారంగా హైప్ సృష్టించే కొత్త ట్రెండ్‌కు నాంది పలికే ప్రాజెక్ట్‌గా కనిపిస్తోంది. మరి ఈ సినిమాతో నారా రోహిత్ ఆడియన్స్‌ను ఏ మేర ఆకట్టుకుంటారో చూడాలి.

# దక్షిణ కోస్తా రైల్వే జోన్ రాష్ట్ర అభివృద్ధికి కీలక మలుపు : పట్టాభిరామ్





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ గెజిట్ (రాజ పత్రం)తో రైల్వే జోన్ ఏర్పాటు ప్రక్రియ పూర్తయిందని, ఇది రాష్ట్ర రాష్ట్రం మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఒక కీలక ముందడుగని విశాఖ పార్లమెంట్ టిడిపి అధ్యక్షుడు చోడే వెంకట పట్టాభిరాం హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల కేంద్రం రైల్వే జోన్ ఏర్పాటుకు అధికారిక గెజిట్ విడుదల చేసిన సందర్భంగా నగరంలోని రైల్వే స్టేషన్ ముందు పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి. దీనిలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విశాఖ రైల్వే జోన్ ఏర్పాటువల్ల రైల్వే లలో రాష్ట్రం మంచి అభివృద్ధి సాధిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ గణబాబు మాట్లాడుతూ జోన్ ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఎన్డీఏ ప్రభుత్వ చిత్తశుద్ధి వెల్లడైందన్నారు. రైల్వే జోన్ కోసం అహర్నిశలు కృషి చేసిన విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్‌కి ధన్యవాదాలు తెలుపుతున్నా మన్నారు. విశాఖ రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారం ముందు ఆయన చిత్రపటాలతో వున్న ప్లకార్డులను ప్రదర్శించారు. టిడిపి కార్యకర్తలు బాణాసంచా పేల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టిడిపి అధ్యక్షుడు చోడే పట్టాభిరామ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అభినందించారు. నాయకులు మాట్లాడుతూ 40 ఏళ్ల నాటి కల నేటితో సాకారమైందన్నారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో మౌలిక వసతుల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం నెరవేరేందుకు తీవ్రంగా కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, విశాఖ ఎంపీ శ్రీభరత్‌లకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ మరియు ప్రధాని నరేంద్ర మోదీని పలుమార్లు కలిసి జోన్ అవసరాన్ని వివరించి ఒప్పించారని చెప్పారు. రైల్వే జోన్ సాధన సమితి కన్వీనర్ చలసాని గాంధీ మాట్లాడుతూ, "రైల్వే జోన్ సాధన కోసం సంవత్సరాల పాటు జరిగిన పోరాటానికి ఫలితం లభించిందన్నారు. విభజన హామీల్లో ఒకటైన ఈ డిమాండ్ నెరవేరడం రాష్ట్ర భవిష్యత్తుకు కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ దక్షిణ నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి సీతం రాజు సుధాకర్, ప్రధాన కార్యదర్శి లోడగల కృష్ణ, విల్లూరు భాస్కరరావు, బైరెడ్డి పోతన రెడ్డి, ఉమ్మి అప్పారావు, ఈతలపాక సుజాత, ఐతి. మధుబాబు, ఐతి. రవి, కోట నరేష్, బుచ్చా రామిరెడ్డి, కింగ్, కేదార్ లక్ష్మి, బొడ్డేటి మోహన్, గొప్ప ధర్మారావు, కుట్ట కార్తిక్ బత్తిన నవీన్, నెక్కెళ్ళ సత్తిబాబు, గొర్లె నాగమణి, వరలక్ష్మి తోట శ్రీదేవి, ఉసిరికాయ విల్లేశ్వరి, రవిశం కర్, సౌజన్య, జయశ్రీ, టిడిపి అనుబంధ సంఘాల నాయకులు, మహిళలు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆర్యవైశ్యుల అభ్యున్నతే లక్ష్యంగా వాసవి ఫౌండేషన్



**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఆర్యవైశ్యుల అభ్యున్నతే లక్ష్యంగా అంతర్జాతీయ స్థాయిలో వాసవి ఫౌండేషన్ సేవలందిస్తుందని సంఘం విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షులు మండవిల్లి వెంకట రాజు పేర్కొన్నారు. మంగళవారం విజయనగరం జిల్లాలో ఒక ప్రైవేట్ అత్యధిక గృహంలో జరిగిన కార్యక్రమంలో సముద్రాల గురు ప్రసాద్ గిరిజా ప్రసన్న దంపతులను ఘనంగా సత్కరించారు. సాహిత్య, సేవ, ఉపాధ్యాయ రంగాలలో అందిస్తున్న సేవలను గుర్తించి వారిని చూసి ఇతరులు స్ఫూర్తి పొందాలని వాసవి ఫౌండేషన్ విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షులు మండ విల్లి వెంకటరాజు పేర్కొన్నారు. పాఠశాల కళాశాల స్థాయి విద్యార్థులకు ప్రోత్సహిస్తూ తెలుగు భాష పరిరక్షణ పట్ల, పుస్తక పఠనం పట్ల అవగాహన కలిగిస్తూ తెలుగు స్వర్ణ నంది పురస్కారం, తెలుగు కీర్తి పురస్కారం స్వీకరించి ఆదర్శప్రాయంగా నిలిచారని అన్నారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు చైర్మన్‌లు మండవల్లి సత్యనారాయణ, చెన్నా బుచ్చి జనార్ధన్‌రావు, కలగర్ల నారాయణ రావు, సలహాదారులు రవ్వ వెంకటేశ్వరరావు, పులిపాటి వెంకట రామారావు, తదితరులు పాల్గొన్నారు.

# మెడికవర్ హాస్పిటల్ మరో విజయం

## - విజయవంతంగా అరుదైన గొంతు శస్త్ర చికిత్స



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** మెడికవర్ ఈఎన్‌టీ విభాగం వైద్యులు మరో అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి వైద్య రంగంలో తమ ప్రతిభను చాటుకున్నారు. కాకినాడ జిల్లాకు చెందిన ఎం.దుర్గ అనే మహిళ గొంతుకు సంబంధించిన క్లిష్ట సమస్యతో బాధపడుతుండగా కాకినాడ మెడికవర్ హాస్పిటల్స్, వైద్యురాలు డా.నికిత రెడ్డి అత్యాధునిక పద్ధతులతో చికిత్స అందించి ఆరోగ్యవంతురాలిగా తీర్చిదిద్దారు. ఈ విజయంపై ఆసుపత్రిలో ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ నిఖిత రెడ్డి మాట్లాడుతూ, "మహిళ గొంతులో ఏర్పడిన అరుదైన కణితి కారణంగా శ్వాస తీసుకోవడంలో, ఆహారం మింగడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కేసు పూర్తి పరిశీలన అనంతరం, శస్త్ర చికిత్సే ఉత్తమ మార్గమని నిర్ణయించి, మా నిపుణుల బృందంతో కలిసి విజయవంతంగా ఆపరేషన్ నిర్వహించామన్నారు. ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని ఆమె తెలిపారు. ఇటువంటి సమస్యలను ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స సులభమవుతుందని, గొంతు సంబంధిత ఇబ్బందులు, శ్వాసలో ఇబ్బంది, దీర్ఘకాలిక గొంతు నొప్పి వంటి లక్షణాలు కనిపించినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆమె సూచించారు. మెడికవర్ హాస్పిటల్స్ సెంటర్ హెడ్ ఎన్ అంజిబాబు మాట్లాడుతూ, "మా ఆసుపత్రిలో అత్యాధునిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన వైద్య బృందం ఉండటం వల్ల క్లిష్టమైన శస్త్రచికిత్సలను కూడా విజయవం తంగా నిర్వహిస్తున్నామన్నారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలను అందించడం మా ప్రధాన లక్ష్యం" అని ఆయన తెలిపారు. ఈ విజయవంతమైన శస్త్రచికిత్సతో మెడికవర్ హాస్పిటల్స్ మరోసారి తన విశ్వసనీయతను నిరూపించుకుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యజమాన్యం, వైద్యులు పాల్గొన్నారు.

# పెనుగుదురు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థుల అద్భుత ప్రతిభ

## - తొలి ఏడాదిలోనే 88 శాతం ఉత్తీర్ణత




**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలం, పెనుగుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో పదో తరగతి ప్రారంభించిన తొలి ఏడాదిలోనే విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. మొత్తం 12 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 10 మంది ఉత్తీర్ణత సాధిం చారు. దీంతో పాఠశాల 88 శాతం ఫలితాలను నమోదు చేసింది. ఉత్తీర్ణులైన విద్యార్థుల్లో 9 మంది ప్రథమ శ్రేణిలో, ఒకరు ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించడం విశేషం. ఐదుగురు విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించి పాఠశాల ప్రతిష్టను మరింత పెంచారు. అత్యధికంగా 573 మార్కులు సాధించిన అమ్మిన మేఘన పాఠశాలలో ప్రథమ స్థానం పొందారు. 515 మార్కులతో గుబ్బల మధు వెంకటసాయి ద్వితీయ స్థానం, 511 మార్కులతో అనుసూరి సంధ్య తృతీయ స్థానం సాధించారు. ఈ ముగ్గురు విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలతో పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన సత్కార కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు బండారు మురళి, మాజీ ఎంపీటీసీ తుమ్మలపల్లి మాచరరావు, నీటి సంఘ అధ్యక్షులు తుమ్మలపల్లి గోవిందు, జనసేన గ్రామ అధ్యక్షుడు గంటా నాని బాబు, మండల విద్యాధికారులు కే.బుల్లి కృష్ణవేణి, పి.సత్యనారాయణ పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తుమ్మలపల్లి వెంకటరత్నం ట్రస్ట్ తరఫున మెమెంటోలు అందజేసి దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ తరఫున ప్రథమ స్థానం పొందిన అమ్మిన మేఘనకు రూ.3,000 నగదు బహుమతి, ద్వితీయ స్థానం సాధించిన గుబ్బల మధు వెంకట సాయికి రూ.2000, తృతీయ స్థానం పొందిన అనుసూరి సంధ్యకు రూ.1,500 నగదు, 500 మార్కులు సాధించిన విద్యార్థులకు రూ 1000 నగదు బహుమతులను తుమ్మలపల్లి మాచరరావు అందజేశారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి మాచరరావు మాట్లాడుతూ తాను ఈ పాఠశాల పూర్వ విద్యా ర్థినని, స్కూల్ గ్రౌండ్ కోసం 50 సెంట్ల భూమిని తమ కుటుంబం అందించిందని తెలిపారు. ట్రస్ట్ ద్వారా ప్రతి సంవత్సరం పాఠశాలకు సహాయం చేస్తానని, ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తా నని హామీ ఇచ్చారు.

బండారు మురళి మాట్లాడుతూ పెనుగుదురు గ్రామంలో టెన్త్ క్లాస్ వరకు పాఠశాలను అభివృద్ధి చేయడంలో రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎంఈఓల సహకారం కీలకమని తెలిపారు. విద్యార్థులు తమ పాఠశాలకు, ఉపాధ్యా యులకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలని, భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత స్థానాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ తుమ్మల పల్లి చంద్రమౌళి, వైస్ చైర్మన్ చింతాకుల లోవకుమారి, దేవు శ్రీను, గుబ్బల భవాని సత్తిబాబు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొని ప్రతిభావంతులైన విద్యార్థులను అభినందించారు.

# దళిత క్రైస్తవులను ఎస్సీలుగానే గుర్తించాలి

## - దళిత క్రైస్తవుల శాంతియుత ర్యాలీ - మతం మారినంత మాత్రాన కుల వివక్ష పోతుందా - చర్చిలపై, మైనారిటీలపై దాడులు అరికట్టాలి





**అమలాపురం, (రాజధాని వార్తలు):** దళిత క్రైస్తవులకు ఎస్.సి హోదా కల్పించాలనే డిమాండ్‌తో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో జిల్లా పాస్టర్ల జేఏసీ ఆధ్వర్యంలో భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన దళిత క్రైస్తవులు ర్యాలీలో పాల్గొని తమ హక్కుల కోసం గళమెత్తారు. పాస్టర్ల జేఏసీ జిల్లా అధ్యక్షుడు విప్పర్తి రాజకుమార్, తాతపూడి ఎర్నెస్ట్, యెహోషువ ఆధ్వర్యంలో అమలాపురం పట్టణంలోని గడియారం స్తంభం సెంటర్ వద్ద ప్రారంభమైన ర్యాలీ, ముమ్మిడివరం గేట్, నల్లవంతెన మీదుగా ఎర్ర వంతెన సమీపంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వరకు సాగింది. "మతం మారితే కులం మారదు" "దళిత క్రైస్తవులకు న్యాయం చేయాలి" దళిత క్రైస్తవులకు శాపంగా మారిన రాజ్యాంగంలోని నిబంధనలు తొలగించాలి అంటూ తమ నిరసన వ్యక్తం చేశారు.ర్యాలీ అనంతరం స్థానిక శాసనసభ్యుడు అయితా బత్తుల ఆనందరావు క్యాంపు కార్యాలయం వద్దకు చేరుకుని తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా ఛైర్మన్ ఆల్లాడ స్వామినాయుడు (సోంబాబు)లకు వినతి పత్రం సమర్పించారు. మతం ఆధారంగా ఎస్.సి హోదాను పరిమితం చేయడం అన్యాయమని అన్నారు. మతం మార్చుకున్నప్పటికీ సామాజిక, ఆర్థికంగా వెనుకబడిన స్థితి మారదని అందువల్ల దళిత క్రైస్తవులను ఎస్.సిలుగానే గుర్తించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రంగనాథ్ మిశ్రా కమిషన్, సచార్ కమిటీలు దళిత క్రైస్తవులకు ఎస్.సి హోదా ఇవ్వాలని సిఫార్సు చేసిన విషయాన్ని వారు గుర్తు చేశారు.

ఆ సిఫార్సులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ ర్యాలీలో జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో దళిత క్రైస్తవులు, సంఘాల నాయకులు, యువత, మహిళలు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.

# జిల్లా ఎస్పీని కలిసిన డీఎస్పీ తిలక్



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం డిఎస్పి ఏ బాల గంగాధర తిలక్ మంగళవారం కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. పెద్దాపురం డిఎస్పీగా సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించిన డిఎస్పి మంగళవారం కాకినాడలోని ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ బిందు మాధవ్‌ను కలిసి పరిచయం చేసుకున్నారు. పెద్దాపురం డీఎస్పీ కార్యాలయంలో ఆయన విధులకు హాజరయ్యారు.

# గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల నియామకం తగదు

## - అజారుద్దీన్, కోదండరాం నియామకాలపై పిటిషన్



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** గవర్నర్ కోటాలో మహమ్మద్ అజారుద్దీన్, ప్రొఫెసర్ ఎం.కోదండరాంను ఎమ్మెల్సీలుగా నియమించడాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. వారిద్దరినీ ఎమ్మెల్సీగా నియమిస్తూ జారీ చేసిన జీవో 71 కు చట్టబద్ధత లేదంటూ షియా సివిల్ కౌన్సిల్ ఫర్ సోషల్ జస్టి?సకు చెందిన సయ్యద్ హైదర్ రజా నఖ్వీ హైకోర్టును ఆశ్రయించారు. కళలు, సాహిత్యం, సామాజిక సేవ వంటి రంగాల్లో విశేష కృషి చేసిన వారిని మాత్రమే గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నామినేట్ చేయాల్సి ఉండగా.. అజారుద్దీన్, కోదండరాంల నియామకం ఇందుకు విరుద్ధంగా జరిగిందని పిటిషనర్ పేర్కొన్నారు. అభ్యర్థులపై పెండింగ్‌లో ఉన్న కేసులు, చట్టపరమైన ఇతర అడ్డంకులను రాష్ట్ర ప్రభుత్వం సరిగా పరిశీలించలేదని పిటిషనర్ ఆరోపించారు. సామాజిక సేవకులను కాకుండా రాజకీయ నాయకులను ఎమ్మెల్సీలుగా నియమించారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో జీవో 71పై తక్షణం స్టే విధించడంతోపాటు రిట్ పిటిషన్‌లో తుది తీర్పు ఇచ్చే వరకు నామినీలు ప్రమాణ స్వీకారం చేయకుండా అడ్డుకోవాలని పిటిషనర్ కోరారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
# 9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- , అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS


- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎవ్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవీస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్లు 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# ప్రజల సౌకర్యార్థం నూతన ఆర్డీవో ఆఫీసు & డి.ఎస్.పి ఆఫీసులను అనపర్తిలో ఏర్పాటు చేయండి : నల్లమిల్లి



**రంగంపేట, (రాజధాని వార్తలు):** ప్రజల సౌకర్యార్థం నూతనంగా ఆర్డిఓ ఆఫీసు మరియు డి.ఎస్.పి ఆఫీసులను అనపర్తిలో ఏర్పాటు చేయవలసిందిగా అనపర్తి నియోజకవర్గం శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడుని కోరుతూ వినతిపత్రం అందజేశారు. తూర్పుగోదావరి జిల్లాలోని అనపర్తి నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట అలాగే మండపేట నియోజకవర్గంలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లో సుమారు నాలుగు లక్షల వరకు జనాభా ఉన్నారని వారు వ్యక్తిగత మరియు వ్యాపార అవసరాల కోసం ఆర్డిఓ కార్యాలయముకు, డీఎస్పీ ఆఫీసులకు వెళ్లాలంటే రాజమహేంద్రవరం వరకు వెళ్లవలసి వస్తుందని ఈ మండలాల్లో చివరన ఉన్న గ్రామాలకు ప్రయాణ భారం ఎక్కువ అవుతుందని అందువల్ల నూతనంగా ఆర్డిఓ మరియు డిఎస్పి ఆఫీసులను ఏర్పాటు చేసి వాటిని అనపర్తిలో ఏర్పాటు చేయవలసిందిగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్యమంత్రికి తన విజ్ఞాపన పత్రంలో వివరించారు. రాజమండ్రి సిటీ మరియు రూరల్ జనాభాతో రాజమండ్రిలో ఉన్న ఆర్డీవో, డిఎస్పీ ఆఫీసుల్లో రద్దీగా ఉండడంతో పనుల జాప్యం జరుగుతుందని అందువల్ల అనపర్తికి కొత్త డిఎస్పీ, ఆర్డిఓ ఆఫీసులు ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందని వారు ముఖ్యమంత్రి వర్యులను కోరారు. అనపర్తి నుండి అటు రాజమండ్రి - కాకినాడలకు రోడ్డు రవాణా సౌకర్యం మరియు రైల్వే లైను సదుపాయం కూడా కలిగి ఉండడం వలన నూతన ఆర్డీవో మరియు డిఎస్పీ ఆఫీసులను అనపర్తిలో ఏర్పాటు చేయడం సదుపాయంగా ఉంటుందని వారు తన లేఖలో ముఖ్యమంత్రికి వివరించారు.

# చిలకలూరిపేటలో పాఠశాల బస్సుల ఆకస్మిక తనిఖీ

**చిలకలూరిపేట, (రాజధాని వార్తలు):** విద్యార్థుల సురక్షిత ప్రయాణమే ధ్యేయంగా రవాణా శాఖ అధికారులు చిలకలూరిపేట పట్టణంలో మంగళవారం భారీ తనిఖీలు నిర్వహించారు. జిల్లా రవాణా అధికారి (డిటిఓ) సంజీవ్ కుమార్ ఆదేశానుసారం, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ (ఎం వి ఐ) ఎన్. గోపాల్ తన సిబ్బందితో కలిసి పలు పాఠశాలలకు చెందిన బస్సులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా అధికారులు ఈ క్రింది భద్రతా ప్రమాణాలను నిశితంగా పరిశీలించారు. ప్రథమ చికిత్స కేంద్రం బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉన్నాయా లేదా? అత్యవసర ద్వారాలు: ఎమర్జెన్సీ డోర్లు సక్రమంగా పనిచేస్తున్నాయా? అగ్నిమాపక పరికరాలు: ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ల లభ్యత మరియు వాటి గడువు. సాంకేతిక భద్రత: వీఎల్‌టీడీ (VLTD) మరియు పానిక్ బటన్ల పనితీరు. విద్యార్థుల భద్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తి లేదు. ప్రతి పాఠశాల యాజమాన్యం రవాణా శాఖ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలి." ఎన్. గోపాల్, ఎంవీఐ కీలక చర్యలు: తనిఖీల్లో నిబంధనలు పాటించని బస్సులను గుర్తించిన అధికారులు, సంబంధిత యాజమాన్యాలకు తక్షణమే నోటీసులు జారీ చేశారు.




గడువు: వారం రోజుల్లోగా బస్సుల్లో ఉన్న లోపాలను సరిచేయాలని ఆదేశించారు.
హెచ్చరిక: నిర్ణీత సమయంలోగా మార్పులు చేయని పక్షంలో బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను రద్దు చేయడంతో పాటు, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలు నిరంతర ప్రక్రియ అని, విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడే ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోమని అధికారులు స్పష్టం చేశారు.

# చిలకలూరిపేట తహసీల్దార్ షేక్ మొహమ్మద్ హుస్సేన్‌కు ఘన సత్కారం




**చిలకలూరిపేట, (రాజధాని వార్తలు):** స్థానిక తహసీల్దార్ షేక్ మొహమ్మద్ హుస్సేన్‌ను గుంటూరు టెక్స్టైల్ పార్క్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. భారత ప్రభుత్వ వస్త్ర పరిశ్రమ మంత్రిత్వ శాఖ ఆమోదంతో మండలంలోని గోపాలంవారిపాలెం వద్ద ఏర్పాటు చేసిన గుంటూరు టెక్స్టైల్ పార్క్ లిమిటెడ్ ప్రతినిధులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వస్త్ర పరిశ్రమ స్థాపనలోనూ, ప్రాంతీయ అభివృద్ధికి ఆయన అందిస్తున్న విశేష సేవలను ప్రతినిధులు కొనియాడారు. అనంతరం హుస్సేన్‌కు శాలువా కప్పి, జ్ఞాపికను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ప్రాంతీయ ప్రగతి: టెక్స్టైల్ పార్క్ ద్వారా స్థానికులకు కలిగే ఉపాధి అవకాశాలు, పారిశ్రామిక వృద్ధిపై ఈ సందర్భంగా చర్చించారు. ప్రభుత్వ సహకారం: పరిశ్రమల అభివృద్ధికి రెవెన్యూ విభాగం అందిస్తున్న తోడ్పాటును ప్రతినిధులు ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు టెక్స్టైల్ పార్క్ బాధ్యులు, సిబ్బంది మరియు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకల సందర్భంగా ఘనంగా నిర్వహించిన కూచిపూడి, దాండియా సక్సెస్ మీట్ వేడుకలు

**కారంపూడి, (రాజధాని వార్తలు):** పల్నాడు జిల్లా కారంపూడి పట్టణంలోని శ్రీ వాసవి కళ్యాణ మండపము నందు శ్రీ వాసవి జయంతి వేడుకల సందర్భంగా నిర్వహించిన చిన్నపిల్లలచే కూచిపూడి, మహిళలు దాండియా కార్యక్రమాలు నటరాజ్ నాట్యమండలి మాస్టర్ అనుదీప్ పర్యవేక్షణలో కార్యక్రమాలు విజయవంతమైనందుకు, ఈ సంవత్సరం నూతనంగా ఆర్యవైశ్య సంఘం వారు రథాన్ని ఏర్పాటుచేసి కార్యక్రమాలన్నీ కూడా ఎంతో ఘనంగా నిర్వహించినందుకు, గత 22 నెలల నుంచి నిర్విరామంగా నారాయణ సేవ అన్నదాన కార్యక్రమంలో శ్రీ వాసవి సేవ అన్నప్రసాద మహిళా కమిటీ సేవ చేసిన సందర్భంగా, జాగృతి ఇంటర్నేషనల్ నుండి అవార్డులు కారంపూడి జాగృతి క్లబ్బుకు వచ్చిన సందర్భంగా, 2023వ సంవత్సరము నండి 2025 ఆర్యవైశ్య మహిళా సంఘం టీంకు అందరిని ఒక వేదిక మీదకు తీసుకురావడానికి శ్రీ వాసవి సేవ అన్న ప్రసాద కమిటీ ఫౌండర్: భవిరిశెట్టి రామారావు, మిట్టిమీద ఆంజనేయస్వామి దేవాలయం చైర్మన్ యిమ్మడిశెట్టి సాంబశివరావు, నిర్వహణ బాధ్యతలు తీసుకొని అందరికీ అవార్డులు అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో నటరాజ నాట్యమండలి అనుదీప్ మాస్టర్ మాట్లాడుతూ దేవాలయ వేడుకలలో దేవుడు ముందు ఒక దాండియా గాని భరతనాట్యం కానీ స్వామి సేవలో చేయటం చాలా గొప్ప విషయం రెండు తెలుగు రాష్ట్రాల్లో అన్ని దేవాలయాల్లో మన సంస్థకు ఒక మంచి గుర్తింపు ఉన్నది దానికి కారణం మీరందరూ కూడా ఐక్యతతో కలిసి పనిచేసే ప్రజల మన్నలను పొందటం చాలా గొప్ప విశేషమని ఇటువంటి కార్యక్రమాలు ఇంకా మరిన్ని జరగాలని కొత్త వారికి కూడా అవకాశం ఇచ్చి వారిని కూడా ముందుకు నడిపించాలని భగవంతుని నాకు ఈ సంకల్పాన్ని ప్రసాదించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని తెలిపారు. కూచిపూడి నృత్యం చేపించుటకు బాధ్యత తీసుకున్న, మరియు దాండియా బాధ్యత తీసుకున్న నాయకురాలకు, శ్రీ వాసవి దేవస్థానం కమిటీ వారికి సక్సెస్ మీట్ నిర్వాహకులకు, దాండియా కార్యక్రమాల్లో పాల్గొన్న, కూచిపూడి కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి మాస్టర్ అనుదీప్ దీప్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అధ్యక్షులు మద్దు హనుమంతరావు ప్రధాన కార్యదర్శి కొత్తమాసు వెంకట రామ్మోహన్ రావు నగరేశ్వర స్వామి ధర్మకర్త యక్కల శ్రీనివాసరావు, వాసవి జాగృతి క్లబ్ అధ్యక్షులు కరాలపాటి ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి కర్నాటి మహేష్, కూచిపూడి బాధ్యతలు తీసుకున్న కారాలపాటి శ్రావణి, పోలిశెట్టి జయ, అన్న ప్రసాద మహిళ కమిటీ చిన్ని లక్ష్మి, భవిరిశెట్టి సీతామహాలక్ష్మి మాజీ అధ్యక్షురాలు యిమ్మడిశెట్టి కోమలి టీం తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం



**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు 17వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ఆమోదం తెలిపింది. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 17వ ఎస్ఐపీబీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టులు 39 వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నాయి. విశాఖపట్నంలో రిలయన్స్ సంస్థ రూ.1 లక్ష కోట్లతో భారీ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. సత్యసాయి జిల్లాలో రూ.51 వేల కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి గ్రీన్ సిగ్నల్ లభించింది. కడపలో అదానీ సంస్థ రూ.12 వేల కోట్లతో హైడ్రో ఎనర్జీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టును చేపట్టనుంది. తిరుపతిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ రూ.2,500 కోట్లతో మోటర్ సైకిల్ తయారీ పరిశ్రమను స్థాపించనుంది. ఈ ప్రాజెక్టులకు నిర్దేశిత గడువుకు ముందే అనుమతులతో ఓ బ్రాండ్ సృష్టిద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# ఆరో ఏడాదిలో మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ చలివేంద్రం సేవలు



**పొన్నూరు, (రాజధాని వార్తలు):** స్థానిక పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం విజయవంతంగా ఆరవ సంవత్సరం, 51వ రోజుకు చేరుకుంది. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని బాటసారుల దాహార్తిని తీర్చేందుకు అసోసియేషన్ చేస్తున్న ఈ కృషిని పలువురు అభినందిస్తున్నారు. మంగళవారం నాడు సేవా కార్యక్రమంలో భాగంగా దాతలు ముందుకు వచ్చి మంచినీరు, మజ్జిగ పంపిణీ చేశారు. మంచినీళ్ల దాతలింగాల సీతారామయ్య, కస్తూరి దంపతులు. మజ్జిగ దాత పద్మనాభుని రవీంద్ర బాబు, మోహన లక్ష్మి దంపతులు ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు తిరుమలశెట్టి ఉమా శంకర్ మాట్లాడుతూ, దాతల సహకారంతోనే గత ఆరు సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా కొనసాగిస్తున్నామని తెలిపారు. సేవా దృక్పథంతో ముందుకు వస్తున్న దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గుడివాడ పవన్, మూర్తి మరియు అసోసియేషన్ సభ్యులు, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

# ఆకస్మిక ముట్టడి... ముమ్మర తనిఖీలు...
# పత్రాలు లేని బైకులు గుర్తింపు


**మర్రిపూడి, (రాజధాని వార్తలు):** మండలంలోని వేమవరంలో పోలీస్‌ల ఆధ్వర్యంలో మంగళవారం వేకువ జామునే గ్రామాన్ని ముట్టడించి గ్రామంలోని ప్రతి ఇంటిని ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కొండేపి సీఐ వైవి రమణయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీలలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పోలీస్ సిబ్బంది పాల్గొని లోతుగా తనిఖీలు నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న పోలీసులు గ్రామం నుండి ప్రజలను బయటకు వెళ్లకుండా, అదేవిధంగా బయట గ్రామాల నుండి వేమవరం గ్రామానికి ప్రజలు రాకుండా గ్రామాన్ని తమ పరిధిలోకి తీసుకొని గ్రామంలోని ఇంటింటిని ఇండ్ల పరిసరాలను అనుమానం వచ్చిన ప్రతి పరిసరాలను నిసదీకరంగా సోదాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని సెంటర్లో గ్రామ ప్రజలతో ఫ్రెండ్లీ పోలీస్ కార్యక్రమం ఏర్పాటు చేసి పోలీస్ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలోని ప్రతి వీధిలో పోలీసులు మందు




వద్దు జీవితం ముద్దు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో చేసిన తనిఖీలలో పత్రాలు లేని 35 ద్విచక్ర వాహనాలు గుర్తించామని వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించామని చెప్పారు. ఈ తనిఖీలలో సర్కిల్లోని ఎస్సైలు టి రమేష్ బాబు,టీ త్యాగరాజు, పి సత్యనారాయణ, పోలీసులు తదితరులున్నారు.

# వివిధ శాఖలపై సీఎం చంద్రబాబు సమీక్ష.. కీలక సూచనలు

**అమరావతి, (రాజధాని వార్తలు):** మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా రైతులు పండించే పంటలకు ధరలు వచ్చేలా చూడాలని ఉన్నతాధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ట్రేసబిలిటి, సర్టిఫికేషన్ విధానం ద్వారా పంటలకు మెరుగైన ధర లభించే అవకాశం ఉంటుందని ఆయన సూచించారు. బుధవారం సచివాలయంలో రాష్ట్రంలో ధాన్యం, అరటి, పొగాకు, ఆయిల్ పామ్ కొనుగోళ్లపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది 42.06 లక్షల మెట్రిక్ టన్నుల మొక్క జొన్న ఉత్పత్తి వస్తుందని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు అధికారులు వివరించారు. రైతులకు లాభసాటిగా ఉండేలా నాణ్యమైన దిగుబడులకు కృషి చేయాలని వారికి స్పష్టం చేశారు. ప్రకృతి సేద్యం విధానంలో వివిధ పంటలను పండించటం ద్వారా రైతులకు ప్రయోజనం కలుగుతుందని సీఎం



చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశానికి వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ఆపరేషన్ సింధూర్ : భారతదేశ వ్యూహాత్మక వైఖరిని పునర్నిర్వచించిన సంకల్పం

'ఆపరేషన్ సింధూర్' వార్షికోత్సవం గుర్తుంచుకోవాల్సిన తేదీ మాత్రమే కాదు; భారత వ్యూహాత్మక దృక్పథంలో వచ్చిన బలమైన, నిర్ణయాత్మకమైన మార్పుకు ప్రతిబింబం. 2026, మే 7న జరిగిన సంఘటనలు కేవలం విజయవంతమైన ఒక సైనిక చర్య మాత్రమే కాదు. అవి రాజకీయ సంకల్పం, సైనిక సన్నద్ధత, సాంకేతిక సామర్థ్యం, జాతీయ పట్టుదలల కలయికను చాటి చెప్పాయి. అనేక విధాలుగా, సంక్లిష్టమైన, బహుముఖ సవాళ్ల మధ్య భవిష్యత్తులో యుద్ధాలను లేదా సంఘర్షణలను భారత్ ఎలా ఎదుర్కోవాలో చెప్పేందుకు నిర్వచనంగా ఆపరేషన్ సింధూర్ నిలిచిపోతుంది. ఈ విజయం వెనుక ఉన్న ప్రధాన కారణం తడబాటు లేని రాజకీయ స్పష్టత. దశాబ్దాలుగా, శత్రువుల రెచ్చగొట్టే చర్యలకు భారత్ స్పందించే తీరు తరచుగా స్వయంగా విధించుకున్న పరిమితులకు లోబడే ఉండేది. ఆపరేషన్ సింధూర్ ద్వారా భారత్ తన సంయమనాన్ని వీడలేదు, కానీ దానిని మరింత మెరుగుపరిచింది. అవసరమైన మేరకే శక్తిని ఉపయోగిస్తూనే, ఒక ఖచ్చితమైన వ్యూహాత్మక సందేశాన్ని శత్రువుకు పంపగలమని భారత్ నిరూపించింది. అదే సమయంలో, అవసరమైతే ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేసే సామర్థ్యం కూడా ఉందని స్పష్టంగా చాటి చెప్పింది. రాజకీయ నాయకత్వం కేవలం నిర్ణయాత్మక చర్య తీసుకోవాలనే ఉద్దేశాన్ని చూపడమే కాకుండా, క్షేత్రస్థాయిలో ఉన్న సైనిక కమాండర్లకు పూర్తి కార్యాచరణ స్వేచ్ఛను ఇచ్చే అంతటి ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శించింది. లక్ష్యం పట్ల ఉన్న ఈ స్పష్టత.. వేగం, ఖచ్చితత్వం, సమన్వయంగా మారింది. ఆధునిక సైనిక పోరాటాల విజయానికి ఈ మూడు లక్షణాలే అత్యంత కీలకం. రాజకీయ సంకల్పానికి వ్యవస్థాగత సామర్థ్యం తోడైనప్పుడు అది దేశ బలాన్ని ఎన్నో రెట్లు పెంచుతుంది. ఆపరేషన్ సింధూర్ ఈ అద్భుతమైన సమన్వయానికి ఒక గొప్ప ఉదాహరణగా నిలిచింది. అంతే ప్రాముఖ్యత కలిగిన మరొక అంశం, భారతదేశం తన బహు-ముఖ సామర్థ్యాలను అత్యంత సమర్థవంతంగా అనుసంధానించడం. నేటి ఆధునిక యుద్ధం.. భూమి, నీరు, ఆకాశానికే పరిమితం కాలేదు; సైబర్, అంతరిక్షం, ఎలక్ట్రోమాగ్నెటిక్ స్పెక్ట్రమ్కు కూడా విస్తరించింది. ఈ విభిన్న రంగాల్లో తన పట్టును ప్రదర్శించడంలో దేశానికున్న ప్రావీణ్యాన్ని ఆపరేషన్ సింధూర్ నిరూపించింది. ఖచ్చితమైన దాడులతో పాటు శత్రువుల సమాచార వ్యవస్థ, సరఫరా గొలుసును దెబ్బతీసే సైబర్ ఆపరేషన్లు తోడయ్యాయి. ఎప్పటికప్పుడు నిఘా, లక్ష్యాలను గుర్తించడంలో అంతరిక్ష వనరులు కీలక పాత్ర పోషించాయి. లక్ష్యాల్ని గుర్తించడంతో పాటు దాడి తర్వాత జరిగిన నష్టాన్ని అంచనా వేయడంలోనూ క్రియాశీలకంగా పని చేశాయి. అదే సమయంలో, ఎలక్ట్రానిక్ వార్ఫేర్ సామర్థ్యాలు శత్రువుల స్పందనను బలహీనపరిచాయి. ఈ ఆపరేషన్ భారత దళాల మధ్య కేవలం సమన్వయాన్నే కాదు, సమష్టి పనితీరు, పరిణతిని ప్రతిబింబించింది. ఈ సమయంలో సివిల్-సైనిక వ్యవస్థల ఏకీకరణ పోషించిన పాత్ర ప్రత్యేకంగా గమనించాలి. ఆపరేషన్ సింధూర్ కేవలం సైనిక ప్రయత్నమే కాదు, దేశం మొత్తం కలిసి చేసిన కృషి. నిఘా సంస్థలు, సాంకేతిక సంస్థలు, పౌర నాయకత్వం, సాయుధ దళాలతో కలిసి పనిచేశాయి. నిఘా వ్యవస్థల



నుంచి ఖచ్చితమైన ఆయుధాల వరకు స్వదేశీ సాంకేతికతలు కీలక పాత్ర పోషించాయి, ఇది స్వయంసమృద్ధిపై మనం నిరంతరం పెట్టిన పెట్టుబడి ఫలితాన్ని చూపించింది. ఈ ఆపరేషన్ భారత నిర్ణయాధికార నిర్మాణంలోని సామర్థ్యాన్ని కూడా ప్రదర్శించింది, ఇక్కడ వివిధ ఏజెన్సీల మధ్య సమన్వయం, బ్యూరోక్రాటిక్ జాప్యాలకు తావు లేకుండా ఒకే లక్ష్యంతో సాగింది. ఆపరేషన్ ప్రారంభానికి ముందే భారతదేశం ఎంతో దూరదృష్టితో వ్యవహరించింది. మనం తీసుకునే చర్యలను ప్రపంచం ఏ విధంగా చూస్తుందనే విషయంలో భారత్ చాలా జాగ్రత్తగా వ్యవహరించింది. మన దౌత్యవేత్తలు ప్రపంచ దేశాలతో నిరంతరం సంప్రదింపులు జరిపి, భారత్ చేస్తున్న ఈ పోరాటం ఎవరినో ఆక్రమించుకోవడానికి కాదని, శత్రువుల రెచ్చగొట్టే చర్యలకు సమాధానంగా చేస్తున్న 'అవసరమైన ఆత్మరక్షణ' అని స్పష్టంగా వివరించారు. దీనివల్ల అంతర్జాతీయ సమాజం కూడా భారత్ తీసుకున్న నిర్ణయం సరైనదేనని గుర్తించింది. ఇలా సైనిక శక్తికి, రాజకీయ నేర్పు, దౌత్యనీతి తోడవ్వడం వల్లే ఆపరేషన్ సింధూర్ ఒక చారిత్రక విజయంగా నిలిచింది. దీనికి భిన్నంగా, పాకిస్థాన్ స్పందన ముందే ఊహించినట్లుగా సాగింది. సైనిక పరంగా చూస్తే, భారత్ మెరుపుదాడికి ఆ దేశం కంగుతిన్నది. తమ దగ్గర ఉన్న అరకొర వనరులు, సరిపోని యుద్ధ సామర్థ్యం వల్ల భారత్ను సమర్థంగా ఎదుర్కోవడంలో పాకిస్థాన్ విఫలమైంది. ఇక దౌత్య పరంగా, ఈ అంశాన్ని అంతర్జాతీయ వేదికలపైకి తీసుకెళ్లి ప్రపంచ దేశాల మద్దతు కూడగట్టాలని చూసినా.. అనుకున్న ఫలితం సాధించలేదు. అయితే, పాకిస్థాన్ ఎక్కువగా దృష్టి పెట్టింది మాత్రం 'సమాచార యుద్ధం' మీదనే. క్షేత్రస్థాయిలో జరిగిన అసలు విషయాలను దాచిపెట్టడానికి, వారు తెలివిగా అల్లిన ఎన్నో అబద్ధాలను ప్రచారం చేశారు. కానీ, వారి మాటల్లో నిజాయితీ, పొంతన లేకపోవడంతో ఆ ప్రయత్నాలు ఫలించలేదు. నేటి ఆధునిక కాలంలో సమాచారం వెనువెంటనే అందుబాటులోకి వస్తుంది కాబట్టి, పాకిస్థాన్ అల్లిన అబద్ధపు కథనాలు ప్రపంచం ముందు త్వరగానే బట్టబయలయ్యాయి. ఈ తప్పుడు ప్రచారాన్ని ఎంతో స్పష్టతతో, ఆత్మవిశ్వాసంతో తిప్పికొట్టడం చాలా ముఖ్యం. ఆపరేషన్ సింధూర్ అనేది భారతదేశం కావాలని చేసిన దురాక్రమణ కాదు.. శత్రువుల ప్రత్యక్ష రెచ్చగొట్టే చర్యలకు భారత్ ఇచ్చిన సరైన సమాధానం. ఈ ఆపరేషన్ లక్ష్యాలు చాలా స్పష్టమైనవి, ఎంచుకున్న స్థావరాలు చట్టబద్ధమైనవి, దీనిని అత్యంత క్రమశిక్షణతో నిర్వహించారు. భారతదేశం ఎప్పుడూ హద్దులు దాటలేదు; అవసరమైన మేరకు మాత్రమే స్పందిస్తూ, అత్యంత సంయమనంతో వ్యవహరించింది. ఆపరేషన్ జరిగినంత కాలం భారత్ నిజమైన సమాచారాన్ని మాత్రమే వెల్లడించింది. ఎంతో పారదర్శకతను పాటిస్తూ, విశ్వసనీయమైన మార్గాల ద్వారా అసలు విషయాలను ప్రపంచానికి తెలియజేయడం వల్ల, వాస్తవాలను వక్రీకరించే శత్రువుల ప్రయత్నాలు పూర్తిగా విఫలమయ్యాయి. ఆపరేషన్ సింధూర్ భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేసే కొన్ని విలువైన పాఠాలను నేర్పింది. మొదటిది, రాజకీయ సంకల్పం అత్యంత కీలకం. మనం ఏ విషయంలోనైనా అస్పష్టంగా ఉంటే అది శత్రువులకు బలాన్నిస్తుంది, అదే స్పష్టమైన వైఖరితో ఉంటే వారు భయపడతారు. రెండోది, యుద్ధతంత్రంలో కేవలం సైన్యమే కాదు, సైబర్, అంతరిక్షం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక రంగాల్లో కూడా మనం పట్టు సాధించాలి. భవిష్యత్తులో మన ఆధిక్యాన్ని నిలబెట్టుకోవడానికి ఈ రంగాల్లో పెట్టుబడులు చాలా అవసరం. మూడవది, దేశంలోని పౌర, సైనిక వ్యవస్థలు మరింతగా కలిసి పనిచేయాలి. జాతీయ శక్తిని ఒక పద్ధతి ప్రకారం సమన్వయం చేసుకున్నప్పుడే మనం ఏ సవాలునైనా సమర్థంగా ఎదుర్కోగలం. మరొక ముఖ్యమైన పాఠం సమాచార యుద్ధతంత్ర రంగంలో ఉంది. ప్రజల ఆలోచనలను, అభిప్రాయాలను ప్రభావితం చేసే ఈ పోరాటం నిరంతరంగా, ఎటువంటి సరిహద్దులు లేకుండా సాగుతూనే ఉంటుంది. తప్పుడు సమాచారాన్ని గుర్తించడానికి, దానిని తిప్పికొట్టడానికి, అది వ్యాప్తి చెందక ముందే అడ్డుకోవడానికి భారతదేశం తన సామర్థ్యాలను మరింత బలోపేతం చేసుకోవాలి. దీనికోసం కేవలం అత్యాధునిక సాంకేతిక పరికరాలు ఉంటే సరిపోదు; వేగవంతమైన, నమ్మదగ్గ సమాచారాన్ని ప్రజలకు చేరవేసే బలమైన వ్యవస్థలు కూడా ఉండాలి. యుద్ధ క్షేత్రంలో విజయం సాధించడమే కాదు, ప్రపంచం ముందు సరైన వాస్తవాలను నిలబెట్టి మన వాదనను గెలిపించుకోవడమనేది వ్యూహాత్మక విజయానికి అత్యంత కీలకం. ఆపరేషన్ సింధూర్ రక్షణ రంగంలో స్వయంసమృద్ధి ప్రాముఖ్యతను మరోసారి గుర్తుచేసింది. మన దేశంలోనే తయారైన యుద్ధ వ్యవస్థలు తమ సత్తాను నిరూపించుకున్నాయి. దీనివల్ల ఇతర దేశాలపై ఆధారపడటం తగ్గడమే కాకుండా, మన నిర్ణయాలు మనమే తీసుకునే స్వేచ్ఛ పెరిగింది. పరిశోధన, అభివృద్ధి, సరికొత్త ఆవిష్కరణలలో నిరంతరం పెట్టుబడులు పెట్టడం ద్వారానే ఈ వేగాన్ని మనం కొనసాగించగలం. ఈ లక్ష్యాన్ని సాధించడంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలు కలిసికట్టుగా పనిచేయడం అత్యంత కీలకం. ఇలాంటి సమన్వయం ఉన్నప్పుడే రక్షణ రంగంలో భారత్ మరింత శక్తివంతంగా మారుతుంది. చివరగా, అస్థిరమైన భద్రతా వాతావరణంలో మనం ఎల్లప్పుడూ సన్నద్ధంగా ఉండాలనే అవసరాన్ని ఈ ఆపరేషన్ గుర్తు చేస్తుంది. శత్రువును నియంత్రించడమనేది ఒకేచోట ఆగిపోయే అంశం కాదు; మనకు ఉన్న శక్తి సామర్థ్యాలను, దృఢ నిశ్చయాన్ని నిరంతరం నిరూపించుకుంటూనే దానిని బలోపేతం చేయాలి. ఆపరేషన్ సింధూర్ ఒక కొత్త ప్రమాణాన్ని నెలకొల్పింది. అయితే, ఈ స్థాయిని భవిష్యత్తులోనూ కొనసాగించాలంటే నిరంతర కృషి అవసరం. దీనికోసం సైనిక శిక్షణను మెరుగుపరచడం, యుద్ధ తంత్రాలను ఆధునీకరించడం, మారుతున్న కాలానికి అనుగుణంగా మన రక్షణ సిద్ధాంతాలను ఎప్పటికప్పుడు మార్చుకుంటూ ముందుకు సాగాలి. భారతదేశం 'ఆపరేషన్ సింధూర్' వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న వేళ, ఈ ఆపరేషన్ అందించిన సందేశం చాలా స్పష్టంగా ఉంది. ఇది కేవలం ఒక సైనిక చర్య మాత్రమే కాదు, ఒక బలమైన వ్యూహాత్మక ప్రకటన. తన ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన సామర్థ్యం, ఆ పనిని నిర్ణయాత్మకంగా పూర్తి చేయగల సంకల్పం.. రెండూ భారతదేశానికి ఉన్నాయని ప్రపంచానికి చాటి చెప్పింది. 'నియంత్రణ' పాటించడం అనేది ఒక ఎంపిక మాత్రమే తప్ప, అది బలహీనత వల్ల వచ్చిన తప్పనిసరి పరిస్థితి కాదని ఈ ఆపరేషన్ ద్వారా నిరూపితమైంది. అంటే, భారత్ శాంతిని కోరుకుంటున్నప్పటికీ, అవసరమైతే కఠినంగా స్పందించడానికి వెనుకాడదని స్పష్టమైంది. రాబోయే కాలంలో, 'ఆపరేషన్ సింధూర్' ఒక అత్యుత్తమ ఉదాహరణగా నిలిచిపోతుంది. బలమైన రాజకీయ నాయకత్వం, జాతీయ సమైక్యత అండగా ఉంటే, మల్టీ-డొమైన్ ఆపరేషన్లను ఎంత సమర్థవంతంగా నిర్వహించవచ్చో ప్రపంచానికి తెలియజేసే పాఠమిది. ఈ ఆపరేషన్ భారత్ పట్ల దేశీయంగా, అంతర్జాతీయంగా ఉన్న అంచనాలను పూర్తిగా మార్చివేసింది. అన్నిటికంటే ముఖ్యంగా, ఇది ఒక శక్తివంతమైన సూత్రాన్ని మరోసారి స్థిరపరిచింది: జాతీయ సంకల్పం, సామర్థ్యం కలిసి పనిచేసినప్పుడు, ఫలితాలెప్పుడూ తిరుగులేని విధంగానే ఉంటాయి. ఆపరేషన్ సింధూర్ వారసత్వం కేవలం ఆ సమయంలో దక్కిన విజయానికే పరిమితం కాలేదు. అది మనలో నింపిన ఆత్మవిశ్వాసంలో, మన వ్యవస్థలు అంతర్గతంగా నేర్చుకున్న పాఠాలలో, భారతదేశ వ్యూహాత్మక భవిష్యత్తు కోసం అది నిర్దేశించిన దిశలో ఆ వారసత్వం దాగి ఉంది. భవిష్యత్తులో కూడా ఇంకా పరిష్కారం కాని వివాదాలు వివిధ రంగాల్లో, కొత్త రూపాల్లో దేశాన్ని పరీక్షిస్తూనే ఉంటాయి. అయినప్పటికీ, దేశంలోని రాజకీయ, సైనిక, వ్యవస్థాగత యంత్రాంగాలు అన్నీ ఒకే తాటిపై ఉండి, పూర్తి స్పష్టతతో, ఒకే లక్ష్యంతో తమ శక్తినంతా సమన్వయం చేసుకున్నంత కాలం, ఆ ప్రభావం సమతుల్యత ఖచ్చితంగా భారత్ కు అనుకూలంగానే ఉంటుంది. అంటే, మన దేశంలోని అన్ని విభాగాలు కలిసికట్టుగా పనిచేసినంత కాలం, ఎదురయ్యే సవాళ్లపై భారత్ పైచేయి సాధిస్తూనే ఉంటుంది.

Lt Gen Syed Ata Hasnain (Retd)
రచయిత : **లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అతా హస్నైన్** (రిటైర్డ్).
(బీహార్ రాష్ట్ర గవర్నర్, భారతదేశపు శ్రీనగర్ కేంద్రంగా పనిచేసే చినార్ కార్ప్స్ మాజీ కమాండర్)
(The writer is Governor, State of Bihar and former Commander of Indiaµs Srinagar based Chinar Corps)

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt, AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan

# ఆత్మగౌరవానికి ప్రతీక లేబర్ అడ్డాలు

**● లేబర్ అడ్డాలు (కార్మిక కూడళ్లు) కేవలం పనికోసం వేచిచూసే ప్రదేశాలు కావు, అవి శ్రమజీవుల ఆత్మగౌరవానికి, స్వాభిమానానికి ప్రతీకలు.**

కార్మికుల కష్టజీవుల చెమట, కండరాల నుండి చైతన్యం వస్తుందని, భావించే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు లేబర్ అడ్డాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.

రాష్ట్రంలోని 80 లక్షల మంది అసంఘటిత కార్మికుల సమస్యలకు పరిష్కార మార్గంగా, వారిని గౌరవప్రదమైన జీవనం వైపు నడిపించే కేంద్రాలుగా ఈ అడ్డాలు మారబోతు న్నాయి.

తెల్లవారుజామునే లేచి, ఎండనక, వాననక పని కోసం రోడ్డెక్కి, ఆత్మవిశ్వాసంతో కష్టపడే శ్రామికుల నైతిక బలం ఈ అడ్డాలు.
ఎవరికీ తలవంచకుండా, సొంత శ్రమతో వచ్చిన డబ్బుతో కుటుంబాలను పోషించుకునే కార్మికుల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఈ అడ్డాలు నిలుస్తాయి. అంతేకాదు కూలీల్లో స్వాభిమానం పెరగడంతోపాటు వారికి తగినంత స్వేచ్ఛ కూడ లభిస్తుంది.
అట్టడుగు వర్గాల కార్మికులు, కూలీలు ఒకచోట చేరినప్పుడు వారి సమస్యలను చర్చించుకుంటూ, సమాజంలో ఒకరికొకరు మద్దతుగా నిలవడంతో పాటు సామాజిక చైతన్యానికి ఈ లేబర్ అడ్డాలు ఎంతగానో దోహదపడ తాయి.
కూటమి ప్రభుత్వం కార్మికుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు లేబర్ అడ్డాల వద్ద ఆధునిక వసతులు, విశ్రాంతి గదులు కల్పించాలని నిర్ణయించడం వారి గౌరవాన్ని పెంచడమే కాదు. అడ్డా కూలీలకు అవి ఆధునిక ఆశ్రయాలు అనడంలో సందేహంలేదు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మాటల్లో చెప్పాలంటే, "ఆత్మగౌరవం లేని జీవితం వ్యర్థం. ఆత్మ గౌరవంతో జీవించాలంటే మనిషి కష్టాలను అధిగమించాల్సి ఉంటుంది".
ఒకప్పుడు నోట్లోకి నాలుగు వేళ్ళు వెళ్ళాలంటే కూలీ చేయాల్సిందే ఉన్న ఊరిలో ఉపాధి లేక పట్టణాలకు వలస పోయి అడ్డా కూలీలుగా మారిన ఉదంతాలు కోకొల్లలు, గ్రామాల నుంచి పని కోసం నగరంలోని కూలీ అడ్డాకు తరలి వచ్చేవారు. కూలీ దొరికిన రోజు దొరికేది. దొరకని రోజు పస్తులే.అడ్డ కూలీల బ్రతుకులు నిత్యం పోరాటంతో కూడుకునేవి. రోజు వారీ కూలిపై ఆధారపడి ఉదయాన్నే పని కోసం ఎదురుచూస్తూ, పనులు దొరకకపోతే పస్తులుండే పరిస్థితులు వారి జీవితంలో సాధారణంగా ఉండేవి.
తెల్లవారుజామునుంచే పట్టణాలలోని అడ్డాల వద్ద వేలాది మంది కార్మికులు కూలి పనుల కోసం పడిగాపులు కాసేవారు.తెల్ల చొక్కా వేసుకుని బైక్ పై, కారుపై వచ్చిన వ్యక్తుల వద్దకు వందలాది కూలీలు పరుగున వచ్చి సార్ పని ఉందా.. సార్ పని ఉందా.. ఏదైనా చేస్తాం, వస్తాం మీవద్దకు అంటూ బతిమిలాడుకుని పనికి వెళ్ళే పరిస్థితులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా గమనించారు.
ప్రతిపక్షనాయకుని హోదాలో రాష్ట్రంలో పర్యటించినప్పుడు కుటుంబాన్ని పోషించడానికి ఆ కష్ట జీవులు పడుతున్న తపనను చూసిన దృశ్యాలు చంద్రబాబు నాయుడు కండ్ల ముందు కదలాడుతున్నాయి. శ్రమ కోసం పాకులాడే పనిలోనే శ్రామికుడు నిమగ్నమైనప్పుడు మూడు పూటల తిండి కోసం తాను పడుతున్న నరకయాతనకు ఫుల్ స్టాఫ్ పెట్టాలనే ఆలోచన ముఖ్యమంత్రి చంద్రబాబు మదిలో మెదిలింది. నిరుపేద కుటుంబాలు మనుషులుగా తల ఎత్తుకుని బతికినప్పుడే కదా అభివృద్ధి అని ఆయన భావించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఈ కూలీలకు ఏదో ఒక ప్రయోజనం చేకూర్చి వారిలో ఆత్మగౌరవాన్ని పెంపొందించే దిశగా కార్యాచరణ ప్రణాళికకు రూపకల్పన ప్రారంభించింది.

ఆ ప్రణాళికకు అనుగుణంగా భవన నిర్మాణ కార్మికులు పనుల కోసం రోజూ ఉదయం రోడ్లపక్కన ఇకవేచి చూసే పని లేకుండా కూటమి ప్రభుత్వం లేబర్ అడ్డాలు(చౌక్ లు)కు శ్రీకారం చుట్టింది. మేడే రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు కృష్ణాజిల్లా పమిడిముక్కలో ఈ లేబర్ అడ్డాను లాంఛనంగా ప్రారంభించారు. ప్రయోగాత్మకంగా రాష్ట్రంలోని 15 నగరాల్లో ఈ అడ్డాలను నిర్మిస్తున్నారు.
కేవలం ఇవి అడ్డాలే కాదు రాబోయే రోజుల్లో వీటిని స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్లుగా మార్చనున్నారు.స్కిల్డ్ , అన్ స్కిల్డ్ కార్మికులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులిస్తారు. తద్వారా వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి స్కిల్డ్ లేబర్ గా తయారు చేస్తారు. ఇప్పటికే నైపుణ్యం ఉన్న వారికి కూడా మరింత శిక్షణ ఇచ్చి హైపవర్ స్కిల్డ్ లేబర్ గా గుర్తిస్తారు.తద్వారా కార్మికుల సంక్షేమం, జీవితాలను సమూలంగా మార్చాలన్నది చంద్రబాబు నాయుడు ఉద్దేశం. అంతేకాకుండా ఆత్యాధునిక పని ముట్లతో పాటు ఈ ఎస్ ఐ ఆస్పత్రుల ద్వారా మెరుగైన వైద్యం అందిస్తారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు వినూత్న ఆలోచనలకనుగుణంగా పదిహేను నగరాల్లో ప్రయోగాత్మకంగా లేబర్ అడ్డాలను అభివృద్ధి చేస్తారు. కార్మికుల సేవలు అవసరమైన ప్రజలు నేరుగా లేబర్ చౌక్ కువెళ్ళి సంప్రదించొచ్చు. అంతేకాకుండా కార్మికులకు పక్కా చిరునామా, వీరందరి కోసం తగిన సదుపాయాలతో ప్రత్యేక భవనాలను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నది. అందుకు సంబంధించి స్థల సేకరణ కూడ జరుగుతున్నది.
రాష్ట్ర వ్యాప్తంగా20 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. ఇప్పటి వరకు వీరంతా ప్రధాన కూడళ్లలో రోజు ఉదయమే చేరి అక్కడి నుంచి పనులకు వెళ్ళుతుంటారు. ఈ 15 నగరాల్లో ఏర్పాటు కానున్న లేబర్ అడ్డాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ 15 లక్షలు చొప్పున ఖర్చు చేస్తారు. వీటిలో తాగునీటి సదుపాయం, పురుషులు, మహిళలకు వేర్వేరుగా మరుగుదొడ్లు,, వంద నుంచి రెండు వందల మంది కూర్చోవడానికి వీలుగా ఏర్పాట్లు చేస్తారు.

వచ్చే ఏడాదిలో రాష్ట్రానికి మరిన్ని ప్రైవేట్ కంపెనీలు రానున్నాయి. ఆయా కంపెనీల నిర్మాణాలు సాగేప్పుడు వారికి నైపుణ్యం ఉన్న కార్మికులు కావాల్సి ఉంటుంది. ఈ క్రమంలో రాష్ట్రంలో నైపుణ్యం ఉన్న కార్మికులను పెంచడం ద్వారా పెట్టుబడి దారులు వేర్వేరు ప్రాంతాల నుంచి కార్మికులను తెచ్చుకోకుండా స్థానికులకు ఉపాధి కల్పించాలనేది చంద్రబాబు నాయుడు ఆలోచన. ఆ దిశగా అడుగులు వేయడం వల్ల కార్మికులకు మేలు జరుగుతుందని, రాష్ట్రానికి కూడా ఉపయోగపడుతుందనే ముందు చూపుతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు లేబర్ అడ్డాలకు శ్రీకారం చుట్టారు.
అలాంటి శ్రమజీవుల గౌరవాన్ని, హక్కులను కాపాడటమే నిజమైన అభివృద్ధి. గత వైసీపీ ప్రభుత్వం మాదిరిగా కార్మికుల సంక్షేమం కోసం కబుర్లు చెబుతూ కాలక్షేపం చేయకుండా వారి కోసం వినూత్న కార్యక్రమాన్ని చేపట్టడం కూటమి ప్రభుత్వం పనితీరుకు నిదర్శనం. కూటమి ప్రభుత్వం చేపట్టిన సరికొత్త ప్రయోగం లేబర్ అడ్డాలు విజయవంతమై కార్మికుల జీవితాల్లో వెలుగు క్రాంతులు ప్రసరించాలని ఆశిద్దాం,

వాసంశెట్టి సుభాష్
కార్మికశాఖ మంత్రి
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

# స్పష్టమైన రాజకీయ సైనిక లక్ష్య సాధన కోసం నియంత్రిత శక్తి వినియోగం

## ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన "ఆపరేషన్ సిందూర్"

**రాజధాని వార్తలు, అమరావతి:** అమెరికా, ఇజ్రాయెల్, రష్యాలు మారుతున్న రాజకీయ-సైనిక లక్ష్యాలతో చేసిన యుద్ధ ప్రయోగాలు, 21వ శతాబ్ద యుద్ధాలు, సంఘర్షణలు తరచు సుదీర్ఘంగా, అస్పష్టమైన పోరాటాలు అవుతున్నాయని నిరూపించాయి. వీటి పర్యవసానాలు యుద్ధ ప్రభావిత ప్రాంతంతో పాటుగా, యుద్ధాన్ని ప్రారంభించిన దేశానికి కూడా వినాశకరంగా మారుతున్నాయి. దీంతో ఆయా దేశాలు మొదట్లో సాధించిన ఆధిక్యం క్రమంగా కోల్పోతున్నాయి. తాలిబన్, ఇరాక్, ఉక్రెయిన్, గాజా, అలాగే ప్రస్తుతం ఇరాన్తో జరుగుతున్న సంఘర్షణలు మనకు ఒక విషయాన్ని స్పష్టంగా చెబుతున్నాయి. సైనిక చర్యల ఉద్దేశ్యం నిరవధికంగా ఒత్తిడిని కొనసాగించడమే కాకుడదు. సైనిక చర్య ద్వారా నిర్ణయాత్మక వ్యూహాత్మక ఫలితాన్ని సాధించాలి, ఆ తర్వాత శక్తివంతమైన సైనిక శక్తిగా తమకు అనుకూలమైన షరతులతో ఆ సంఘర్షణ నుంచి వైదొలగాలి.

ఆపరేషన్ సిందూర్లో భారతదేశం చూపిన ప్రతిస్పందన, ప్రపంచ సైనిక శక్తులు, ముఖ్యంగా అమెరికా వంటి దేశాలు అంతర్గతంగా స్వీకరించదగిన ఒక బలమైన ప్రత్యామ్నాయాన్ని అందిస్తోంది. అమెరికా అధ్యక్షుడు కాల్పుల విరమణపై అనేకసార్లు గొప్పలు చెప్పుకున్నప్పటికీ.. భారీ సైనిక, ఆర్థిక విధ్వంసం సృష్టించిన అనంతరం కూడా ఇరాన్తో కాల్పుల విరమణను సాధించలేకపోయారు. ఈ నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్, స్పష్టమైన నిర్దేశిత లక్ష్యాలతో వ్యూహాత్మకంగా బలప్రయోగం చేయడం, ఆ లక్ష్యాలు సాధించిన తర్వాత క్రమశిక్షణతో కూడిన సంయమనాన్ని పాటించింది అనేందుకు ఒక చక్కని ఉదాహరణ. పాకిస్తాన్ రక్షణ వ్యవస్థ అండతో ఉగ్రవాదులు చేసిన దారుణ కవ్వింపు చర్య తర్వాత ఆపరేషన్ సింధూర్ ప్రారంభమైంది. ఈ ఘటనలో ఉగ్రవాదులు తమకు అందిన ఆదేశాల మేరకు కేవలం మగవాళ్లను మాత్రమే ఎంచుకుని.. వారి కుటుంబ సభ్యులు, భార్యలు, పిల్లలు, తల్లిదండ్రుల కళ్లెదుటే మతపరమైన ప్రాతిపదికన అత్యంత కిరాతకంగా హత్య చేశారు. దీని తర్వాత జరిగిన పరిణామాలు భావోద్వేగ ఉద్రిక్తతో, అపరిమితమైన ప్రతీకారంగానో సాగలేదు. ఒక క్రమబద్ధమైన శ్రేణి యుద్ధతంత్రం అమలయ్యింది. ఇందులో ప్రతి అడుగు వేగంగా, శిక్షించే విధంగా, శత్రువుకు భారీ నష్టాన్ని కలిగించేదిగా, వేర్వేరు లక్ష్య సమూహాలను నాశనం చేసేలా రూపొందించారు. ఇది భారత సామర్థ్యాన్ని, ఉద్దేశ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది.

అదే సమయంలో, ఉద్రిక్తతలను తగ్గించుకోవడానికి అవసరమైన అవకాశాన్ని కూడా స్పష్టంగా అట్టిపెట్టింది. ఇది బలహీనత కాదు, ఇది నియంత్రణ. ఇది ఆవేశం కాదు, ఇది తమ సామర్థ్యాల మీద, తమ పోరాటంలోని న్యాయబద్ధత మీద ఉన్న అచంచలమైన విశ్వాసం నుంచి పుట్టిన నిర్దాక్షిణ్యమైన పద్ధతి. అంటే, భారత్ భావోద్వేగాలకు లోనుకాకుండా, అత్యంత ఆత్మవిశ్వాసంతో, స్పష్టమైన ప్రణాళికతో శత్రువును దెబ్బతీసింది.

భారత విధానంలోని కీలకమైన లక్షణం రాజకీయ-సైనిక లక్ష్యంపై ఉన్న స్పష్టత. సరిహద్దు ఉగ్రవాదానికి బాధ్యులైన యంత్రాంగం, వ్యక్తులపై తక్షణమే, స్పష్టంగా కనిపించే నష్టాన్ని కలిగించడం, తద్వారా శత్రువును అదుపులో ఉంచే నియంత్రణ శక్తిని పునరుద్ధరించడమే దీని ప్రధాన లక్ష్యం. ఇదంతా కూడా అణు సిద్ధాంత పరిమితులకు, అంతర్జాతీయ చట్టాలకు లోబడే జరిగింది. శత్రువుకు చెందిన కీలక ఆస్తులను వేగంగా ధ్వంసం చేయడం ద్వారా, పాకిస్థాన్ సైనిక నాయకత్వానికి మానసిక దిగ్భ్రాంతిని కలిగించడం ద్వారా లక్ష్యాలు నెరవేరగానే, భారత్ యుద్ధ ఉద్రిక్తతను స్వయంగా నిలిపివేసింది. అంటే, లక్ష్యం పూర్తయిన వెంటనే అనవసరమైన యుద్ధాన్ని కొనసాగించకుండా భారత్ సంయమనం పాటించింది.

88 గంటలలోపే, భారత సాయుధ దళాలు స్పష్టమైన, నిస్సందేహమైన ఆదేశాలు జారీ చేసిన రాజకీయ వ్యవస్థకు వాటి మిషన్ లక్ష్యాలను అందించాయి. ఎలాంటి పరిణామాలు ఉండవని భావించిన పాకిస్తానీ సైనిక వ్యవస్థ, వాటిని రెచ్చగొట్టినా ఫలితం ఉండదని భావించి, కాల్పుల విరమణ కోరింది. వారి రాజకీయ నాయకులు ప్రత్యక్ష ప్రసార మాధ్యమాల ముందు భయంతో వణికిపోతుండగా, సైనిక కమాండర్లు అజ్ఞాతంలోకి వెళ్ళిపోగా, వారు మోకరిల్లి కుప్పకూలిపోయారు.

కేవలం 88 గంటల వ్యవధిలోనే, భారత సాయుధ దళాలు తమకు అప్పగించిన లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేశాయి. రాజకీయ నాయకత్వం అందించిన అత్యంత స్పష్టమైన, నిస్సందేహమైన ఆదేశాలకు అనుగుణంగా ఈ మిషన్ను అమలు చేశాయి. ఎటువంటి పర్యవసానాలు ఉండవనే ధీమాతో రెచ్చగొట్టే చర్యలకు పాల్పడిన పాకిస్థాన్ సైనిక యంత్రాంగం, చివరికి గత్యంతరం లేక కాల్పుల విరమణ కోసం ప్రాధేయపడింది. ఆ సమయంలో పాకిస్థాన్ రాజకీయ నాయకులు ప్రత్యక్ష ప్రసారాల్లో భయంతో వణికిపోతుండగా, వారి సైనిక కమాండర్లు అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. క్లుప్తంగా చెప్పాలంటే, భారత దళాల ధాటికి వారు మోకరిల్లి, పూర్తిగా కుప్పకూలిపోయారు. ఇది భారత సైనిక సామర్థ్యం ముందు శత్రువు లొంగిపోయిన తీరును స్పష్టం చేస్తోంది.

ఈ ఘట్టం అత్యంత కీలకమైనది. ఇది ఒక వ్యవస్థాగత వాస్తవాన్ని స్పష్టం చేసింది. "వెయ్యి గాయాలతో భారతదేశాన్ని రక్తమోడించాలి" అనే వ్యూహం చుట్టూ పాకిస్థాన్ వ్యూహాత్మక సిద్ధాంతం చాలా కాలంగా తిరుగుతుంది. అయినప్పటికీ, పాకిస్తాన్ అధికార పరిధిలోకి కీలక భాగాలను లక్ష్యంగా చేసుకుని భారత్ చేసే ఎదురయ్యే వేగవంతమైన, పదునైనా, అత్యంత తీవ్రమైన స్పందనను తట్టుకోగల శక్తి పాకిస్థాన్కు లేదు. భారత్ పై నిరంతర శత్రుత్వాన్ని పెంచుకోవడం కేవలం భావజాలపరమైన విషయమే కాదు, ఆ దేశ వ్యవస్థలతో ముడిపడి ఉన్న అవసరం. పాకిస్థాన్ దేశంపై అక్కడి సైన్యం తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి, మన దేశం నుంచి ముప్పు పొంచి ఉందనే ఈ యుద్ధ వాతావరణమే ప్రధానాధారం. అంటే, ఈ వివాదం కొనసాగితేనే పాకిస్థాన్ సైన్యానికి ఆ దేశంలో తిరుగులేని శక్తి ఉంటుంది. ఆపరేషన్ సింధూర్ ద్వారా భారత్ ఈ మూలాలను దెబ్బతీసి, వారి బలహీనతను బయటపెట్టింది.
పాకిస్థాన్ తన వ్యూహాత్మక ధోరణిని ప్రాథమికంగా మార్చుకుంటుందని ఆశించడం వాస్తవ విరుద్ధమని భారత వ్యూహకర్తలు గుర్తించారు. ఎందుకంటే, ఆ దేశానికి మనపై ఉన్న శత్రుత్వం అప్పుటికప్పుడు కలిగింది కాదు, వారి ఉనికే దానిపై ఆధారపడి ఉంది. అందుకే, పాక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి బదులుగా, తక్షణ నష్టాన్ని కలిగించడం ద్వారా శత్రువును అదుపులో ఉంచే విధానాన్ని ఎంచుకుంది. అదే సమయంలో అంతులేని యుద్ధ సుడిగుండంలో చిక్కుకోకుండా జాగ్రత్త పడింది. ఈ తేడాను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. పాకిస్థాన్ సైన్యం ఆ దేశంపై తన ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి మతపరమైన గుర్తింపును, మన నుంచి తమకు ముప్పు ఉందనే వాదనను వాడుకుంటుంది. అటువంటి పరిస్థితుల్లో, వారి మూల సిద్ధాంతాలను మార్చాలని ప్రయత్నించడం అసాధ్యమైన పని. అందుకే, ఆ దేశ భావజాలాన్ని మార్చడం కంటే, అత్యంత విశ్వసనీయమైన, పరిమితమైన చర్యల ద్వారా వారి ప్రవర్తనను అదుపు చేయడమే గొప్ప వ్యూహాత్మక పరిణతి అని భారత్ నిరూపించింది. అంటే, అవసరమైనప్పుడు దెబ్బకొడుతూ వారిని దారికి తీసుకురావడమే సరైన మార్గమని భారత్ భావించింది.

అమెరికా వ్యూహకర్తలకు, ఇటీవల వారు పాల్గొన్న సైనిక చర్యలతో పోలిస్తే భారత్ అనుసరించిన ఈ విధానం ఒక స్పష్టమైన భేదాన్ని చూపిస్తోంది. అమెరికా తన తిరుగులేని సైనిక ఆధిపత్యాన్ని పదేపదే నిరూపించుకుంది, కానీ క్షేత్రస్థాయిలో సాధించిన ఆ విజయాలను క్లుప్తమైన, ఖచ్చితమైన వ్యూహాత్మక ఫలితాలుగా మార్చడంలో తరచూ విఫలమవుతోంది. ఒక సైనిక చర్యను సరైన నియంత్రణలో ఉంచకపోతే, అది క్రమంగా తన పరిధిని పెంచుకుంటూ పోతుంది, అసలు లక్ష్యం మసకబారుతుంది, ప్రారంభంలో అనుకున్న ఉద్దేశాల కంటే ఎంతో దూరం విస్తరిస్తుంది. దీనివల్ల వ్యూహాత్మక అలసట, వనరుల వృధా, కొన్ని సందర్భాల్లో ఆ దేశ గౌరవం కూడా దెబ్బతింటుంది. ప్రస్తుతం జరుగుతున్న ఇరాన్ యుద్ధంలో కూడా అమెరికాకు ఇదే పరిస్థితి ఎదురైంది. ఇది అమెరికాకు కొత్తేమీ కాదు; గతంలో ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్ మరియు వారు ప్రమేయం ఉన్న ఇతర యుద్ధాలలో జరిగిన పరిణామాలే ఇక్కడ మళ్ళీ పునరావృతమయ్యాయి.



\- Lieutenant General Devendra Pratap Pandey (Retd.)

\- లెఫ్టినెంట్ జనరల్ దేవేంద్ర ప్రతాప్ పాండే (రిటైర్డ్)

ప్రస్తుతం జరుగుతున్న ఇరాన్ యుద్ధానికి 'ఆపరేషన్ సింధూర్' నమూనాను వర్తింపజేయడం ఒక గుణపాఠం వంటి ఉదాహరణగా ఉంటుంది. అణు మౌలిక సదుపాయాలు, బాలిస్టిక్ క్షిపణి సామర్థ్యాలు, కీలకమైన అధికార కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని సాగించిన ఈ కేంద్రీకృత పోరాటం, కొద్ది వారాల్లోనే పూర్తిస్థాయి వ్యూహాత్మక విజయాన్ని సాధించింది. అత్యంత నిర్ణయాత్మకమైన దెబ్బను ముందే స్పష్టంగా తెలియజేసి, సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ఇరాన్ ప్రతిస్పందన సామర్థ్యాన్ని అప్పటికే బలహీనపరిచింది. దీనిని అనుసరిస్తూ, సైనిక చర్య ముగిసిందని ప్రకటించి, నిరంతర సైనిక ఉనికికి బదులుగా దౌత్య, ఆర్థిక చర్చల వైపు మళ్లడం వల్ల రాజకీయ-సైనిక లక్ష్యాలను సాధించి ఉండవచ్చు. ఈ విశ్లేషణను 2026 మార్చిలో 'జూసాఔా' అనే భారతీయ థింక్ ట్యాంక్ ప్రచురించిన 'ఇష్యూ బ్రీఫ్ 496'లో రచయిత స్పష్టంగా వివరించారు.

ఇరాన్ కూడా చాలా ముందుగానే ఒక మార్గం కోసం చూసింది, కానీ అమెరికా లక్ష్యాలు సంపూర్ణ నిర్మూలన లేదా లొంగదీసుకోవడం దిశగా మారాయి. దానికి బదులుగా ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకున్నారు. మొత్తం రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే లక్ష్యంతో చేపట్టిన సుదీర్ఘ సైనిక చర్యలు ద్వితీయ, తృతీయ స్థాయి పరిణామాలకు దారితీసి, చివరికి అమెరికా ప్రయోజనాలకు, ప్రతిష్టకు హాని కలిగిస్తున్నాయి. సుదీర్ఘ సైనిక చర్యలు అసమాన ప్రతీకారాన్ని ఆహ్వానిస్తాయి, దేశీయ మద్దతును హరించివేస్తాయి, నిర్వహించడం కష్టమైన భౌగోళిక రాజకీయ శూన్యతలను సృష్టిస్తాయి. ఇరాన్ ఈ అన్ని అంశాల్లోనూ విజయవంతంగా ముందుకు సాగింది. దెబ్బతిని, విధ్వంసానికి గురైనప్పటికీ ఇరాన్ తిరిగి పుంజుకుని విజేతగా నిలిచింది. దీనికి విరుద్ధంగా, స్పష్టమైన లక్ష్యాలతో కూడిన స్వల్పకాలిక, శక్తివంతమైన జోక్యం ఉండి ఉంటే.. ఆశించిన ఫలితాలను సాధించడంతో పాటు వ్యూహాత్మక సౌలభ్యం కూడా దక్కేది.

ఆధునిక యుద్ధం అంటే కేవలం బలప్రయోగం మాత్రమే కాదు, శత్రువు, అంతర్జాతీయ సమాజ అభిప్రాయాలను నిర్వహించడమని భారత విధానం తెలియజేస్తుంది. తన ప్రతిస్పందనను తగిన విధంగా సర్దుబాటు చేసుకోవడం ద్వారా, భారత్ తొందరపాటు లేకుండా సంకల్పాన్ని ప్రదర్శించింది. తాము నిర్ణయాత్మకంగా వ్యవహరించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, అనియంత్రిత సంఘర్షణలను నివారించేందుకు కూడా అంతే నిబద్ధతతో ఉన్నామని సంకేతమిచ్చింది.

చాలా మంది విశ్లేషకులు ఉద్రిక్తతలు కొనసాగాలని కోరుకున్నప్పటికీ, భారత నాయకత్వం ఘర్షణ వైఖరితో ఉండలేదు. దానికి బదులుగా, తన విస్తృత జాతీయ ప్రాధాన్యతల వైపు, ముఖ్యంగా తన దీర్ఘకాలిక అభివృద్ధి పథం పై దృష్టి సారించింది. నరేంద్ర మోదీ నాయకత్వంలో, దేశం తన స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల సందర్భంగా 2047 నాటికి ఒక ప్రతిష్ఠాత్మకమైన దార్శనికతను నిర్దేశించుకుంది. ఆర్థిక వృద్ధి, సాంకేతిక పురోగతి, ప్రపంచ ఏకీకరణ ఈ లక్ష్యానికి కేంద్రంగా ఉన్నాయి. ఆపరేషన్ సింధూర్కు విరామం ఇచ్చిన తర్వాత, పాకిస్తాన్ సైనిక వ్యవస్థ మరో తప్పు చేసేందుకు సాహసిస్తే, దానిపై నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించి, దేశ దీర్ఘకాలిక లక్ష్యాల దిశగా ముందుకు సాగింది. కాల్పుల విరమణ ప్రతిపాదనను, విరామాన్ని అంగీకరించి, తద్వారా సుదీర్ఘ సంఘర్షణను నివారించడం ద్వారా భారతదేశం తన దీర్ఘకాలిక లక్ష్యాలను సాధించేందుకు అవశ్యకమైన ఆర్థిక, రాజకీయ సామాజిక అభివృద్ధిపై దృష్టి పెట్టే అవకాశాన్ని కాపాడుకుంది. దీనికి విరుద్ధంగా, సుదీర్ఘ సైనిక పోరాటాలలో చిక్కుకున్న దేశాలు తరచుగా తమ దేశీయ అజెండాలు పక్కన బెట్టి, వనరులు దారి మళ్లించాల్సి వస్తుంది. నిరంతర యుద్ధ వాతావరణం వల్ల అంతర్జాతీయ ప్రతిష్ట కూడా సంక్లిష్టంగా మారుతుంది.

ఆపరేషన్ సిందూర్ కేవలం సైనిక సామర్థ్యానికి ఒక అధ్యయనమే కాదు, రాజనీతిజ్ఞతలో ఒక పాఠం కూడా. బల ప్రయోగం అంటే కేవలం శత్రువులను అణిచివేసే సాధనంగా కాకుండా, విధానపరమైన లక్ష్యాలను సాధించే ఒక కచ్చితమైన సాధనంగా ఎలా ఉపయోగించవచ్చో ఇది బోధిస్తుంది. సామర్థ్యంతో పాటు సంయమనం కూడా ఉన్నప్పుడు, అది విశ్వసనీయతను తగ్గించకపోగా, పెంచుతుందని నిరూపిస్తోంది. అంతేకాకుండా, ఒక సైనిక చర్యను ప్రారంభించడం ఎంత ముఖ్యమో, సరైన సమయంలో దాన్ని ముగించడం కూడా అంతే ముఖ్యం అనే భావనను కూడా బలపరుస్తుంది.
అంతర్జాతీయ సమాజం దీని నుంచి గ్రహించాల్సిన ముఖ్య విషయం స్పష్టంగా ఉంది. సంక్లిష్టమైన, తరచుగా పరిష్కరించలేని సంఘర్షణలు ఉన్న ప్రపంచంలో, విజయం అనేది పోరాటంలో పాల్గొన్న కాల వ్యవధిపై కాకుండా, లక్ష్యాలు, ఫలితాల మధ్య ఉన్న సమన్వయంపై ఆధారపడి ఉంటుంది. భారతదేశ మితమైన, ప్రభావవంతమైన ప్రతిస్పందన, ఒక నిర్ణయాత్మక దెబ్బ కొట్టి, ప్రత్యర్థి వ్యూహాలను మార్చుకునేలా ఒత్తిడి తెచ్చి, ఆపై మనకు అనుకూలమైన పరిస్థితులలో వెనక్కి తగ్గడం సాధ్యమేనని తెలుపుతుంది.
ఆపరేషన్ సిందూర్ పూర్తి నిర్మాణం కేవలం ఒక మంచి వ్యూహం మాత్రమే కాదు, అది అత్యంత క్రమశిక్షణతో తెలివైన బల సామర్థ్యాన్ని ప్రయోగించడం.

**– లెఫ్టినెంట్ జనరల్ దేవేంద్ర ప్రతాప్ పాండే** (రిటైర్డ్)

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt.Ltd; Printed at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur dist, Andhra Pradesh-522237; Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur dist, Andhra Pradesh-522237;
Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2019/77985, Postal Regd No: GTR/84/2016-18, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founder: Hussain Khan